ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
మే 31, 2015

# విలక్షణ విద్యలు

# ప్రతి వారం సినిమా చూడాల్సిందే

'సావారియా'తో బాలీవుడ్‌లోకి అమాయకంగా అడుగెట్టి... అనతి కాలంలోనే అత్యధిక పారితోషికం అందుకునే కథానాయకుడి స్థాయికి ఎదిగిన స్టార్ రణబీర్ కపూర్. నటనలో, దర్శకత్వంలో శిక్షణ పొంది... 'బ్లాక్'తో సహాయ దర్శకుడిగా తెరంగేట్రం చేసినా .... నటుడిగా ప్రేక్షకులకు పరిచయమైంది మాత్రం ఆ తర్వాత రెండేళ్లకే. రిషి కపూర్, నీతూ సింగ్ కపూర్ తనయుడిగా, రాజ్‌కపూర్ ముద్దుల మనవడిగా...ఎన్నో అనుభవాలు, అనుభూతులు. వాటిలో కొన్ని....

- అమ్మ నీతూ తనను ఎప్పుడైనా కోప్పడితే సరాసరి తాత దగ్గరకెళ్లి ఫిర్యాదు చేసేవాడు. ఇక ఆయన మనవడి వైపు నిలబడి... నీతు మీద కేకలు వేసేవాడు.
- ఆదివారం ఉదయాలు తన మునిసంతానంతో గడిపేవారు రాజ్ కపూర్. చాక్లెట్ల ప్యాకెట్ తీసుకొచ్చి పిల్లలందరికీ పంచి... వాళ్లతో తన బాల్య స్మృతులను పంచుకునేవారు. ఇది రణబీర్‌కు ఇంకా గుర్తే.
- ఓసారి రష్యా టూర్ వెళ్తున్న రాజ్ కపూర్‌ని స్యూట్ తీసుకురమ్మని అడిగాడట రణబీర్. ఇక చూస్కోండి ఏనాడూ ఎవరి కోసం ... షాపింగ్ చేయని రాజా సాబ్ మనవడి కోసం మార్కెట్లో అందుబాటులో వున్న అన్ని రంగుల స్యూట్లు కొనుక్కొచ్చి ఇచ్చాడట.
- సినిమాల్లో రాజ్‌కపూర్ ప్రభావం రణబీర్ మీద చాలా వుంది. రణబీర్ చూసిన తొలి ఆర్.కె సినిమా శ్రీ 420. ఆ ఒక్క సినిమాకే... తాత నటనకు ఫిదా అయిపోయాడు చిన్నారి రణబీర్. రాజ్‌కపూర్ బయోపిక్ చేసే చాన్స్ వస్తే ఎగిరి గంతేసి మరీ ఒప్పుకుంటాడట.
- ముంబైలో 12వ తరగతి పూర్తి చేసుకున్న రణబీర్ ఫిల్మ్ స్కూల్లో చదవడానికి న్యూయార్క్ వెళ్లాడు. ప్రతి వారాంతంలోను తప్పకుండా బాలీవుడ్ సినిమా చూసేవాడు. రాజ్‌కపూర్, బిమల్ రాయ్, గురు దత్, మెహబూబ్ ఖాన్ సినిమాలంటే చాలా ఇష్టం! వాళ్ల సినిమాలను బాల్యం నుంచి చూపించిన నాన్న రిషి అందుకు కారణమేమో! అయితే రణబీర్ నటుల నుంచి కాక దర్శకుల నుంచి స్ఫూర్తి పొందాడు. రణబీర్ ఎవరినైనా, దేన్నైనా ఇట్టే అనుకరించేస్తాడు. తన తొలి చిత్రం 'సావారియా' చిత్రీకరణ జరిగేటప్పుడు విరామ సమయంలో ... షారుక్, హృతిక్, సంజయ్ దత్...వంటి పెద్ద పెద్ద హీరోలను అనుకరించి నవ్వించేవాడు. సంజయ్ దత్ జీవితం ఆధారంగా రాజ్ కుమార్ హిరాని రూపొందించనున్న చిత్రంలో సంజయ్ పాత్రను రణబీర్ కపూర్ పోషించనున్నాడు.
- ఇంట్లో రణబీర్ కపూర్ గది ... వాళ్ల అమ్మమ్మ గదికి ఎదురెదురుగా వుండేవి. పెద్దావిడ మనవడి క్షేమ సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వుండేది. అలా ఆమెతో ఎక్కువ సాన్నిహిత్యం పెరిగింది. ఆవిడ చనిపోయినప్పుడు రణబీర్ తేరుకోవడానికి చాలా సమయమే పట్టింది.
- పసితనం నుంచి అమ్మానాన్నలను... వారి జీవితంలో ఒడిదుడుకులను చూస్తూ పెరిగాడు. అయినప్పటికీ వివాహ వ్యవస్థ మీద తనకు పూర్తి నమ్మకం వుందని చెప్తుంటాడు సందర్భం వచ్చినప్పుడు.



తాతయ్య రాజ్‌కపూర్‌తో...

అమ్మ, నానమ్మ, సోదరితో....



అమ్మానాన్నతో...

స్నేహ ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

# మచ్చేంద్ర జాలం

**పె**ళ్లి చేసుకోవడమే కాదు! చేయడమూ కష్టమే! మరి మచ్చలేని వారు దొరకాలంటే మాటలా! పిల్ల (పిల్లాడు) గురించి చిలకపలుకుల్లా పెద్దలు చెప్పిన వివరాలతో వాస్తవాలు తెలీడంలా. ఇరుగుపొరుగు, సహాధ్యాయులు, సహోద్యోగుల అమూల్యమైన అభిప్రాయాలనూ సేకరిస్తున్నారు. ఢిల్లీ, ముంబై వంటి మహా నగరాల్లో ఏకంగా ప్రయివేటు డిటెక్టివ్‌లను నియమించి మరీ రాబట్టుకుంటున్నారు. పిల్ల(పిల్లాడు) గురించి మాత్రమే కాదు. అమ్మానాన్నలూ, తోబుట్టువులూ, వారి ఉద్యోగాలు, విలాసాలు, వ్యాపకాలు, పొదుపు మొత్తాలు, అప్పుల లెక్కలు ... అన్నీ తెలుసుకుంటున్నారు. సంతృప్తికరంగా వుంటే... సంబంధం కలిపేసుకుంటున్నారు.

◆ ◆ ◆

టీనేజీ పిల్లలు...పెళ్లీడు యువతీయువకుల కోరిక ఒకటే. మిల్క్ బ్యూటీ తమన్నాలా, బాలీవుడ్ అందం ఐశ్వర్యా రాయ్‌లా మిలమిలా మెరిసిపోవాలి. ముఖారవిందం శ్వేత కమలంలా విరిసిపోవాలి. షారూక్‌లా స్మూత్‌గా వుండాలి. ఒక్క మొటిమ కానీ, దాని తాలూకు మచ్చ కానీ కనపడకూడదు. క్రీములు, లోషన్లు, పౌడర్లు, కేకులు ... ఏది దొరికితే అది. మోడళ్లు... స్టార్లు... ఏది చెప్తే అది ... అద్దేయడమే. ఖర్చుకు వెనకాడేదే లేదు, మరి మచ్చ కనబడకూడదు కదా!

◆ ◆ ◆

నిష్కళంకులకు ఓటు వేయాలన్నది ఓటర్ల చిరకాల వాంఛ. ఆ అరుదైన అవకాశం కోసం ఎంతగానో ఎదురుచూస్తారు. ఎన్నికలొచ్చాక... తీరా అభ్యర్థుల పేర్లు ప్రకటించాక... వారి నేపథ్య కథనాలు విన్నాక...చదివాక...చూశాక (టీవీల్లో)... ఈసారికీ తమ కోరిక తీరనట్టేనని తీర్మానించుకొని ... సుదీర్ఘ నిట్టూర్పు ఒకటి వదులుతారు. అంతలోనే రాబోయే ఎన్నికల్లోనైనా మచ్చలేని నాయకులు నిలబడకపోతారా అన్న ఆశావహ ఆలోచనతో దైనందిన జీవితంలో పడిపోతారు.

◆ ◆ ◆

నిమిషానికో స్కాము, క్షణానికో కుంభకోణం బైటపడుతున్న కాలంలో ... గొప్పగా కాలరెగరేస్తున్నారు మన ప్రధానమంత్రుల వారు. గద్దెనెక్కి ఏడాది పూర్తయిన సందర్భంగా ... మచ్చ లేని ...స్వచ్ఛమైన పాలననిచ్చానని ... దాదాపు ప్రతి వేదిక మీదా గొప్పగా డప్పు కొట్టుకుంటున్నారు (గడ్కరీ సాబ్ అవినీతి మీద చర్చ జరిగిన సంగతి మర్చిపోయినట్టున్నారు). అయినా తాము స్నేహం చేసేది బడా, విదేశీ కార్పొరేట్లతోననీ...వారితో నెయ్యం ఎప్పటికైనా ముప్పేననీ ... స్కాములంటూ జరిగితే ... ఇప్పుడు కాకపోయినా... ఎప్పటికైనా మెడకు చుట్టుకుని తీరతాయని ... మోడీ వారు మరువకూడదు మరి.

■

◆ మనలో మాట




# టపా

## అన్నీ ఆకట్టుకున్నాయి

**ఈ** వారం ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహలో అన్ని అంశాలు బాగున్నాయి. ముఖ్యంగా 'రేపటి బీడు' కథ చాలా బాగుంది. రాజధాని ప్రాంతంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కళ్లకు కట్టినట్టుగా వివరించారు. అలనాటి అందాల తార బి. సరోజాదేవికి సంబంధించిన వివరాలు ఆసక్తికరంగా ఉన్నాయి.

**-మార్టూరు అజయ్ కుమార్,**
**చిలకలూరిపేట (మెయిల్)**

## కలర్ సూపర్

**ఈ** వారం కలర్ పేజీలు చాలా బాగున్నాయి. పెళ్లా అప్పుడేనా... అంటూ వివిధ కథానాయికలు ఇచ్చిన సమాధానాలు కొంటెగా వున్నా ఆలోచింపచేశాయి. కెరీర్‌కి నేటి తరం ఎంత ప్రాధాన్యతనిస్తోందో తెలుస్తోంది. కొమ్మ కొమ్మకో సన్నాయి చదివించింది. అంతరించిపోతున్న కళను ఈ విధంగా చూపించడం బాగున్నా... ఎంత దౌర్భాగ్య స్థితిలో ఉన్నామో అనిపించింది. టైరు పార్క్ బాగుంది. వ్యర్థాలతో ఈ విధంగా తయారు చేయడం అద్భుతం. మనిషి తలుచుకుంటే సాధించలేనిది ఏమీ లేదని నిరూపించారు.

**వెంకట్, కర్నూలు.**

## రేపటికి నిదర్శనం

**రా**జధాని ప్రాంతంలో భూములు తీసుకోవడం వాటి వల్ల వచ్చే సమస్యలను కళ్లకు కట్టినట్లు చూపించారు. స్మార్ట్ సిటీల పేరుతో భూములను లాక్కోడం ఎంత వరకు సమంజసం? పరిహారం కింద ఎంత ఇచ్చినా అతని పొలం తిరిగిరాదు కదా. ఇప్పటికైనా ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

**భాస్కర్, విశాఖ.**

## సర్వం భోగం

**అ**నంత విశ్వంలో దాగి ఉన్న ఎన్నో నిజాలను, మరో పక్క చేదు అనుభవాలను కళ్ళ ముందు నిలుపుతుంది. మనిషి యొక్క మేథో సంపత్తికి ఒక నిదర్శనంగా నిలుస్తాయి ఈనాటి మ్యూజియాలు. ఈ వారం అట్టమీది కథ 'సర్వం దర్శనం' బాగుంది. పరిశోధకుల చారిత్రక శిల్పం నుంచి ఆది మానవులు రాతి పనిముట్ల వరకు అన్నిటిని చూసే అవకాశం రావడం ఎంతో అద్భుతం. ఇలాంటి వ్యాసాలు ఇవ్వడం వల్ల మన దేశంలో ఉండే విలువైన వస్తువులను ఆనాటి చారిత్రక ఆనవాళ్లు కూడా మన ముందు ప్రత్యక్షమవుతాయి. కొన్ని చోట్ల కాలగర్భంలో కలిసి పోవడానికి సిద్ధంగా వున్న అపారమైన సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉంది.

**రాము, కడప**

## వృక్షో రక్షతి రక్షిత:

**మొ**న్న ప్రకృతి విలయ తాండవం, నిన్న భానుడి భగభగ. అంతలోనే ఇన్ని మార్పులెందుకు? ప్రకృతి ఇంతలా మారడానికి గల కారణాలేంటి? ప్రపంచీకరణ నేపథ్యంలో మనిషి మనుగడే ప్రశ్నార్థకం అవుతోంది. అడవులు నరకడం, వాటి వల్ల ఎదురయ్యే సమస్యలకు ప్రత్యక్ష సాక్షిగా నిలుస్తున్నాడు నేటి మానవుడు. చెట్లను కాపాడటం వలన మనిషి ఆయుష్షు మరో వందేళ్ళు పెరుగుతుందని ఒక నానుడి. ఖమ్మం జిల్లాకు చెందిన చెట్ల రామయ్య ఆ ప్రయత్నంలోనే వున్నాడు. మనమూ ఆ లక్ష్యంలో భాగస్వాములం అవుదాం.

**కనక, విజయవాడ (మెయిల్)**

**సం**చికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 21/1, ఆజామాబాద్, హైదరాబాద్-500020.
**మెయిల్ అడ్రస్** : snehaweekly.praja@gmail.com

## ఈ సంచికలో....

# విలక్షణ విద్యలు

**కవర్‌స్టోరీ** ........ 14

మనది యువ భారత్. యువతకే చెందాల్సిన భారత్. కానీ, యువత భవిత నత్తనడక నడుస్తోంది. ఒకప్పటి గొప్ప ఇంజినీర్ ఇప్పుడు వీధికొకడు, ఎం.కామ్ చదివిన అమ్మాయి ఏ ప్రత్యేకత లేక కామ్ అయిపోతే, ఐటీ నేర్చినా ఆమె కెరీర్ డౌటే. అంతే లేని సమాచారాన్ని పెటా బైట్ల మేర బుర్రల్లోకి బలవంతంగా ఎక్కించేస్తున్నారు గానీ, క్రాష్ అవుతున్న సిస్టమ్‌ను పట్టించుకోవడం లేదు. ప్రధాన స్రవంతి నుంచి వేరుపడి భవితకు కొత్తదార్లు వేస్తున్న కొన్ని చదువులకు మల్లితే కొంతైనా పరిస్థితిలో మార్పు వస్తుంది. ఇంటర్మీడియట్ అనంతరం ఎంచుకోదగిన అలాంటి కొన్ని విలక్షణ విద్యల గురించినదే ఈ వారం అట్టమీది కథ.

**టెక్ గురూ** ........ 3
'బుల్లెట్' సఫాయిలు

**నవ్వుల్-పువ్వుల్** ........ 4

**వింతలోకం** ........ 5
సాలీళ్ల వాన

**చూద్దామా** ........ 6
మది దోచే 'మూవీ వరల్డ్'

**పోరు** ........ 8
వెలి వేసేంత నేరమా?

**రుచి** ........ 9
పప్పుతో ఓ పట్టు పడదాం

**సినిమా కబుర్లు** ........ 10
హాస్యానికి లాస్యం

**కథ** ........ 18
పోలీసు గుర్రం

**ప్రత్యేకం** ........ 21
యవ్వని అవ్వ

........ 22
**బాలనేస్తాలు**
రాతి బొమ్మలోయ్!

**కొత్త పుస్తకాలు** ........ 24
మధ్యతరగతి రంగుచీర



వేట పక్షులకు ఆప్తులు ........12

స్ఫూర్తికి మోడల్ 13

చాలా పాత సినిమాలనో, వీడియోలనో చూసినవారికి వాటిలో ఓ వింత కనబడుతుంది. మనుషులు చీమల్లా చకచకా కదులుతున్నట్టు కనిపిస్తారు. ఫ్రేమ్‌ల సంఖ్య అప్పట్లో తక్కువ, అందుకే నిజజీవితంలో నిదానంగా కదిలే ముసలాడు కూడా పడుచు పిల్లాడిలా పరుగున నడుస్తాడు వాటిల్లో. నిజజీవితంలోను అలా యంత్రాల్లా పని చేస్తూ జపాన్ బుల్లెట్ రైళ్లను ఏడే నిమిషాల్లో శుభ్రం చేస్తున్న సెవెన్ మినట్ షింకాన్సెన్ థియేటర్ జట్టు గురించి తెలుసుకోవాల్సిందే. బుల్లెట్ రైళ్ల వేగంతో పోటీపడి చకచకా పనులు చక్కదిద్దేస్తున్న వారి కదలికలు పాత వీడియోల్లో చూసినట్టే ఉంటుంది.

టెక్ గురు

# ‘బుల్లెట్’ సఫాయిలు

జపాన్ వేగవంతమైన బుల్లెట్ రైళ్ల చివరి మజిలీ టోక్యో స్టేషన్. వారి భాషలో షింకాన్సెన్ అని పిలిచే ఈ రైళ్లు అక్కడ కేవలం 12 నిమిషాల సేపే ఆగుతాయి. ఈ లోగా వాటిని శుభ్రం చేయాలి. అంత బారున్న రైళ్లను అణువణువూ తళతళలాడించాల్సిందే. రోజుకు 210 రైళ్లు పరుగులు తీస్తుంటాయి. వీటన్నింటినీ అతి తక్కువ కాలంలో శుభ్రపరిచే విషయంలో రైళ్ల శాఖకు తొలుత ఇబ్బందులు ఎదురయ్యాయి. అపరిశుభ్రతకు అణువంత చోటు కూడా ఉండకూడదనేది లక్ష్యం. దీనికి పరిష్కారంగా వారు ఓ జట్టును తయారు చేశారు. వేగంగా పని చేసేలా శిక్షణనిచ్చారు. ముఖ్యంగా వారు చేసే పనిపై గౌరవం కలిగేలా, వారు గర్వించేలా స్ఫూర్తి పాఠాల్ని బోధించారు. జపాన్ సంప్రదాయ ఓమోటెనాషి వసతులతో ఆకట్టుకున్నారు. తొమ్మిదేళ్లుగా ఎప్పటికప్పుడు దిద్దుబాటు చేసుకుంటూ 800 మందితో ఓ పక్కా జట్టును రూపొందించారు. పని భారం, భరింపరాని పని పరిస్థితుల నుంచి బయటపడేశారు. కొత్త తరహా పరికరాలను అందించారు. కార్మికుల మధ్య సుహృద్భావం పెరిగేలా ఎప్పటికప్పుడు సభ్యుల్ని మారుస్తూ స్నేహపూర్వక జట్లను తయారు చేశారు. ఓ ప్రత్యేకమైన యూనిఫామ్‌ను రూపొందించి కొత్తదనంతో పాటు ఉత్తేజాన్ని తీసుకొచ్చారు. అందమైన, సువాసనలు వెదజల్లే పూల టోపీలు, వేసవిలో హవాయి వస్త్రధారణతో సఫాయిలు ఉల్లాసంతో పాటు వారి సంతోషాన్ని ప్రయాణీకులకు పంచుతున్నారు.

వీరిని 22 మంది చొప్పున 11 జట్లను తయారుచేశారు. బుల్లెట్ రైలు వచ్చేప్పుడు వినమ్రంగా దానికి స్వాగతం చెబుతారు. రైలు ఆగగానే తలుపులకు ఇరువైపులా నిలబడి ప్రయాణీకులు తెచ్చే చెత్తను సేకరిస్తారు. ఆ తర్వాత చకచకా రైలులోకి కదిలి అంగుళం అంగుళం వెతికి శుభ్రం చేస్తారు. వంద సీట్లున్న ఒక్కో కారును ఒక కార్మికుడు శుభ్రం చేస్తారు. ప్రతి నిమిషానికి పక్కా ప్రణాళిక పెట్టుకుని పనిచేస్తారు. అలా ఒక్కో కార్మికుడు రోజుకు 20 రైళ్లకు పనిచేస్తారు. మంచి సేవ అనే ఎజెండాతో పనిచేసే వీరి సేవల్ని గుర్తిస్తూ నిక్కీ అనే వాణిజ్య పత్రిక జపాన్‌లోనే అతి పటిష్టమైన జట్టుగా కీర్తించింది.

వీరి పనితనం గురించి తెలుసుకున్న ప్రపంచంలోని ఇతర సంస్థల వారు ఆదర్శంగా తీసుకున్నారు. ప్రఖ్యాత మేనేజ్‌మెంట్ విశ్వవిద్యాలయం హార్వార్డ్ ఏకంగా ఓ బృందాన్ని పంపి వారి పనితీరుపై అధ్యయనం చేయించింది.

వారి విజయంలోని సూత్రాలను పాఠ్యాంశాల్లో పొందుపరిచేందుకు సిద్ధమైంది. ఫ్రాన్స్ రైల్వే శాఖ కూడా వీరిచే శిక్షణ తీసుకునేందుకు సిబ్బందిని ఎంపిక చేసింది. విఖ్యాత హాలీవుడ్ నటుడు, అమెరికన్ రాజకీయవేత్త ఆర్నాల్డ్ స్క్వాజినేగర్ అయితే జపాన్ పర్యటనలో ఉండగా వారి గురించి వాకబు చేసి, ప్రత్యేకంగా వెళ్లి వారు పనిచేసే విధానాన్ని గమనించాడు. వారి సేవకు కృతజ్ఞతలు తెలపడంతో పాటు గుర్తుగా ఫొటో కూడా తీసుకున్నాడు. సంఘటితంగా పనిచేస్తూ, నూతన విధానాలను అమలు చేస్తూ మంచి గుర్తింపు పొందుతోంది ఆ జట్టు.

# నవ్వుల్ – పువ్వుల్

## జీరో




**తండ్రి:** ఏరా జీరో మార్కులొచ్చాయన్న బాధైనా లేకుండా శుభ్రంగా ఆడుకుంటున్నావు?

**కొడుకు:** మన పీఎం మోడీ గారికే జీరో మార్కులొచ్చాయి నాన్నా. ఆయనేమైనా బాధపడుతున్నాడా చెప్పు?

## ఆటగాడు

"మంచి ఆటగాడు అని చెపితే ఏదో పెద్ద ప్లేయరు అని పెళ్లి చేసుకున్నా తీరా చేసుకున్న తరువాత తెలిసింది" విచారంగా అంది సుమలత

"ఏమైంది? మరి ఆటగాడు కాదా అతను" అడిగింది శ్రీదేవి.

"ఆటగాడే.... పేకాటలో నెం1 అట. ఏడ్చింది సుమలత.

## రోలు వేశాను

మొన్న రిలీజైన కొత్త సినిమాలో ఒక రోలు వేశానన్నావు.
ఫస్ట్‌డే – ఫస్ట్ షో చాలా జాగ్రత్తగా చూశాను.ఎక్కడా కనిపించలేదే?"

"పిచ్చోడా? ఆ సినిమాలో హీరోయిన్ పెళ్ళి సీన్‌లో పేరంటాళ్లు దంచిన పసుపు "రోలు" సెట్లో వేసిందెవరకున్నావు నేనే.

## అన్నిటా ఫస్టే

**ఒ**రే శేఖర్ బాగా చదువుతున్నావ్రా అడిగాడు తండ్రి

**బా**గానే చదువుతున్నాను. డాడీ నాకన్నీ ఫస్టు మార్కులే.

**గు**డ్ అలా చదవాలి.
ఇంతకీ ఏఏ సబ్జెక్టులో ఎన్ని మార్కులు వచ్చాయి? అడిగాడు తండ్రి.

**'ఇం**గ్లీషులో ఒకటి. తెలుగులో ఒకటి. లెక్కలో ఒకటి. సైన్స్‌లో ఒకటి. ఇలా అన్ని సబ్జెక్టుల్లో ఫస్టు మార్కులే డాడీ!

## స్వీటు

**శాంతం**: ఏమే కాంతం మీ అబ్బాయి మావాడి చేత రాళ్ళు తినిపిస్తున్నాడు చూశావా?

**కాంతం:** నిక్షేపం లాంటి మైసూరు పాక్ ముక్కల్ని పట్టుకుని రాళ్ళంటారేమిటి?

## డబ్బు-అనుభవం

**"అ**నతి కాలంలోనే ధనవంతుడిగా ఎలా అయ్యావ్?" అడిగాడు రాజు.

"ఒకతని పార్టనర్‌గా చేరాను. అతని దగ్గర డబ్బుండేది. నా దగ్గర అనుభవముండేది. అందుకే రిచ్ మ్యాన్ అయ్యాను!"

"అదే ఎలా? అర్ధమయ్యేలా చెప్పు" మళ్లీ ప్రశ్నించాడు రాజు.

"ఇప్పుడు నా దగ్గర డబ్బు ఉంది...అతని దగ్గర అనుభవం ఉంది..!" అసలు విషయం చెప్పాడు తాపీగా.

## ఎక్కడికి?



**బాటసారి:** బాబూ ! ఈ రోడ్డెక్కడికిపోతుంది!

**వ్యక్తి:** తిన్నగా పోతే దక్షిణానికి . అటు తిన్నగా పోతే ఉత్తరానికి, తర్వాత తూర్పుకు, ఆఖరకు పడమరకు తిరిగి చివరకు ఇక్కడికే వస్తుంది బాబూ!

## చోరీ

(పరీక్ష హాల్లో ఒక విద్యార్థిని చూసి )

**ఇన్విజిలేటర్:** పరీక్ష రాయకుండా ఏడుస్తున్నావేంటి బాబూ?

**విద్యార్థి**: (మరింత బిగ్గరగా ఏడుస్తూ) నేను కష్టపడి రాసి తెచ్చుకున్న స్లిప్పులు ఎవరో కొట్టేశారు సారు...

వింతలోకం

# బెడ్డు మీదే పుడ్డు

**మం**చంపై టిఫిన్ ప్లేట్ పట్టుకుని కూర్చుంటే పెద్దోళ్లు చీవాట్లు పెట్టడం, వారిని ఖాతరు చేయకుండా టిఫిన్ లాగించేయడం అలవాటే. కానీ, బెడ్డు మీదే పుడ్డు తింటేనే చాలా బాగుంటుందని లండన్ లెనార్డ్ వీధిలోని ఓ రెస్టారెంట్ నిర్వాహకులు చెబుతున్నారు. మీరలా హాయిగా బెడ్డు మీద నడుం వాల్చండి, చిటికెలో మాంచి ఘుమఘుమలాడే భోజనం వడ్డిస్తాం అని బోర్డు పెట్టేశారు. ఇంతకీ విషయమేమిటంటే ఆ నిర్వాహకులకు ఫర్నిచర్ షాపు, రెస్టారెంట్లు రెండూ ఉన్నాయి. విడివిడిగా ఉన్నవాటిని కలిపి హాయిగా వ్యాపారం చూసుకోవచ్చనేది ఆశ. దానికి తగ్గట్టే రెస్టారెంట్‌లో బెడ్డులను సర్దేసి భోజన ప్రియులకు ఆహ్వానం పలుకుతున్నారు. బెడ్డు మీద వేయాల్సిన దిండ్లు, దుప్పట్ల రంగులు, రకాలతో పాటు పిల్లలు ఆడుకునే బొమ్మలు వరకు నచ్చింది ఆర్డర్ చేయొచ్చు. అలా రిలాక్స్ అవుతూ ఇష్టమైన భోజనాన్ని ఆర్డర్ చేయొచ్చు. తినడమయ్యాక కాసేపు కునుకు తీయొచ్చు. అయితే ఇదంతా 45 నిమిషాల్లో పూర్తి చేయాలి. లేకపోతే బెడ్డింగ్ బిల్లు డబులవుతుంది. అలా అవ్వాలనేమో నిద్రపుచ్చే ప్రత్యేక తేనీరును అందిస్తారు. కావాలనుకుంటే నిద్ర థెరపిస్టుల సలహాలను ఇప్పిస్తారు. ఉదయం ఏడింటి నుంచి మధ్యాహ్నం మూడింటి వరకు తెరిచే ఈ బెడ్ కెఫేలో, స్వీడిష్ సంప్రదాయ వంటకాలు ప్రత్యేకం.




# తీరిక రాజకీయం

**మె**క్సికన్ రాజకీయ నేత రెనాటో ట్రోంకో గోమెజ్, వీరాక్రజ్ రాష్ట్రానికి స్వతంత్ర డెప్యూటీగా బాధ్యతలు తీసుకున్నాడు. బాధ్యతలూ మరీ ఎక్కువై పనిభారం తీరిక లేకుండా చేయడంతో ఓ కొత్త ఉపాయాన్ని ఆలోచించాడు. తనలానే ఉన్న మరో వ్యక్తి ఎవరన్నా ఉంటే చెప్పండి, వారికి రెండు లక్షల రూపాయల వరకు ప్రైజ్ మనీ ఇస్తానని ఫేస్‌బుక్‌లో ప్రచారం చేస్తున్నాడు. అలాంటి వ్యక్తి దొరికితే తన బదులు కొన్ని కార్యక్రమాలకు పంపి పని తప్పించుకుందామని అతడి ఆలోచన. ఆ కాంటెస్ట్‌లో ఇప్పటికే కొంత మంది షార్ట్‌లిస్ట్ అయ్యారు. వారిలో ఎవరు అచ్చుగుద్దినట్టు ఉంటారనేది మాత్రం ఆయన భార్యే నిర్ణయించాలట. ఆ తర్వాత ఆ వ్యక్తి కోరికలు సాధ్యమైతే తీర్చి, అతన్ని తన పనికి ఉపయోగించుకుంటాడు. తన ఆహార్యం, వేశ, భాషలు, అభినయంలో తర్ఫీదునిచ్చి రాజకీయ కార్యక్రమాలకు సిద్ధం చేస్తానని చెబుతున్నాడు.

# సాలీళ్ల వాన

**ఆ**స్ట్రేలియాలోని దక్షిణ పీఠభూమి ప్రాంతమైన గౌల్‌బర్న్ ప్రజలు వారికే కాదు ఇళ్లకు, పొలాలకు కూడా గొడుగులు కట్టే ఆలోచనలో ఉన్నారు. అంత బీభత్సమైన వర్షం పడుతుందా! అయినా గొడుగులేం ఆగుతాయి అనుకునేరు. అక్కడ కురుస్తోంది సాలీళ్ల వర్షం. లక్షల సంఖ్యలో సాలీళ్లు, వాటి గూళ్లు ఆకాశం నుంచి ఆ ప్రాంతంలో పడుతున్నాయి. చూడ్డానికి భయంకరంగా కనిపించే ఆ వర్షాన్ని చూసి గుండెను తమాయించుకోవడానికి ఏంజెల్ రెయిన్ (దేవతా వర్షం) అని పేరు పెట్టుకున్నారు. అసలే ఒక్క సాలీడును చూసినా సోఫా పైకి ఎగిరి గంతేస్తారు కొందరు. ఆ మాత్రం అందమైన, ధైర్యానిచ్చే పేరు పెట్టకపోతే ఎలా మరి. ఇంతకీ ఈ తరహా కీటకాల వర్షం వింతేం కాదని శాస్త్రవేత్తలు తేల్చేశారు. బలూనింగ్ అనే పద్ధతిలో సాలీళ్లు లాంటి కొన్ని కీటకాలు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలస పోతాయట. న్యూ సౌత్ వేల్స్‌లో ప్రతి మే, ఆగస్ట్ నెలల్లో ఈ తరహా ప్రయాణం సర్వసాధారణం. అచ్చు మనం గాలి పటం ఎలా ఎగరేస్తామో, గాలి బుడగల్లో ఎలా విహరిస్తామో అలా, ఎత్తైన ప్రాంతాలకు చేరుకుని ఉధృతంగా వీస్తున్న గాలిలో తమ సాలె దారాన్ని చిమ్ముతాయి. తేలిగ్గా ఉండే ఇవి సాలీళ్లను ఎగిరేలా చేస్తాయి. ఆకాశంలో గాలివాటున ఎంతో ఎత్తుకు చేరుకున్నాక అనువైన ప్రాంతం కనిపించగానే దారాల్ని వదిలేస్తాయి. అలా కిందకు వర్షంలా చేరుకుంటాయి. అయితే లక్షల సంఖ్యలో బలూనింగ్ ప్రయాణం రికార్డైంది ఇక్కడే. అయితే ఇలా ప్రయాణించేవి పసి సాలీళ్లే. ఇవి విషపూరితం కాదు. కనీసం కొరకనూ లేవని స్థానికులకు చెప్పి పరిశోధకులు ధైర్యానిస్తున్నారట. అయితే, ఒక్కోసారి ఈ లక్షల సాలీళ్ల గుంపు మొత్తం సూర్యకాంతిని అడ్డుకుని చాలా రోజుల పాటు ఉండే అవకాశముంది. అప్పుడు పంటలకు ప్రమాదం. ఈ ఏంజెల్ హెయిర్ లేదా రెయిన్‌కు భిన్నంగా సాలీళ్లు మరో పనిని చేస్తాయి. వరదలు, భారీ వర్షాల సమయంలో నేల బొరియల్లో ఉండే సాలీళ్లు దట్టమైన గూళ్లను రోడ్లపై చెట్లపై అల్లి అక్కడకు లక్షల సంఖ్యలో చేరుకుంటాయి. వాతావరణంలో మార్పు కనిపించాక ఎప్పటిలానే తమ ఇళ్లలోకి చేరిపోతాయి.

# మది దోచే 'మూవీ వరల్డ్'

**ఆస్ట్రేలియాలో 'గోల్డ్ కోస్ట్' ఓ అద్భుత ప్రదేశం. అందులో 'మూవీ వరల్డ్' మరింత ప్రత్యేకం. అక్కడి సీ వరల్డ్ వింతలు, విశేషాలు వర్ణించడం కష్టమే. సీల్ చేపల విన్యాసాలు, స్టంట్ డ్రైవింగ్ కార్ల పరుగులు, డాల్ఫిన్ చేపల జల క్రీడలు, పాటలు, మిక్కీమౌస్ వేషగాళ్ల నృత్యాలు...ఒకటా రెండా... అన్నీ సందర్శకులను కట్టిపడేసేవే!**

బ్రిస్బేన్ డౌన్‌టౌన్‌లో కేవలం నడకకు అనుమతించిన రోడ్లమీద నడుస్తున్నాం. ఇక్కడ వాహనాల్ని అనుమతించరు. అందరిదీ కాలినడకే. అందమైన రోడ్డు. ఒక పక్క రెస్టారెంట్లు. ఎత్తైన చెట్లు. ఫుట్ పాత్‌లకు టైల్స్ ఫ్లోరింగు. విశ్రాంతిగా కూర్చోవటానికి బెంచీలు. మరోపక్క మాల్స్. సొంపైన సంగీతం వినవచ్చింది. చుట్టూ చూశాను. దారి పక్కన గుమిగూడిన ప్రేక్షక శ్రోతల మధ్య గిటారు వాయిస్తూ గాయకుడు. సంగీత ప్రదర్శన పూర్తైంది. అతని ముందు పరిచిన తెల్లని బట్టపై నాణేలు, నోట్ల వర్షం కురిసింది. వాటిని తీసుకుని అతను వెళ్లిపోయాడు. ఇక్కడ ప్రదర్శన ద్వారాగాని మరో రకంగా గాని యాచించాలంటే ఎవరికిపడితే వారికి స్వేచ్ఛ ఉండదు. తమ కళను లేదా సమస్యను నగర కౌన్సిల్ ముందు విన్నవించుకోవాలి. వారు పరీక్షించి ఆమోదించి సర్టిఫికెట్ ఇచ్చాకే కార్యక్రమంలోకి దిగాలి.

ఊబకాయం పట్టికలో అమెరికా పక్కన ఆస్ట్రేలియా చేరుతుంది. ఇందులో పురుషుల కంటే స్త్రీల సంఖ్య ఎక్కువ. జన్యువుల సంగతి పక్కన పెడితే తినే ఆహారంలో పరిమితి లేకపోవటం వల్ల కూడా జరుగుతుందని అంచనా. ఇరవై ఐదు సంవత్సరాల యువతి ఊబకాయంతో వీల్ చైర్లో రావటం చూసిన మాకు మనసు చివుక్కుమంది. ఇక్కడ కాళ్ళు, చేతులు, వీపు, మెడ మీద పెద్దపెద్ద పచ్చబొట్లు పొడిపించుకునేందుకు స్త్రీ, పురుషులిద్దరూ పోటీ పడతారు. కొందరైతే శరీరమంతా పొడిపించుకోవటం వింత అనిపిస్తుంది.

**మూవీ వరల్డ్**

గోల్డ్ కోస్టులో చూడదగింది మూవీ వరల్డ్. ఈ సినిమా ప్రపంచం 415 ఎకరాల విస్తీర్ణంలో నాలుగు భాగాలగా నిర్మించబడింది. దీనిని 1991 లో ప్రారంభించారు. ఒక పక్క కార్ల రేసింగ్. మరో పక్క చిన్న పిల్లల మిక్కీమౌస్, ఒక పక్క సెట్టింగులు, ఇంకో పక్క వైల్డ్ వాటర్ ఫాల్స్ ఇలా అనేక ప్రోగ్రాములు వుంటాయి.

**స్టంట్ డ్రైవింగ్**

స్టంట్ డ్రైవింగ్ స్థలం బాగా విశాలంగా ఉంటుంది. ముందుగా రెండు పొడవాటి కార్లు అత్యంత వేగంగా వస్తాయి. ఒకదానికొకటి రెండడుగుల దూరంలో ఇరవై అడుగుల కైవారంలో గిరగిరా తిరుగుతాయి. ఒక దానికొకటి ఎదురుగా ఒకదాని వెంట యింకొకటి ఇలా రకరకాలుగా తిరుగుతాయి. వేగంగా తిరగటం వల్ల దట్టంగా పొగలు వస్తాయి. ఇంతలో ఒక కారు పదిహేను అడుగుల ఎత్తు పైనుండి దూకి వీటి మధ్య తిరిగి వెళ్లిపోతుంది. కుడివైపు రెండు చక్రాలు పైకిలేచి ఎడమవైపు రెండు చక్రాలపై పరుగిడటం, ముందు చక్రాలు లేచి వెనక చక్రాలపై వేగంగా దూసుకుపోవడం లాంటి ప్రయోగాలు ఎన్నో ఈ ప్రదర్శన చూశాక సినిమాల్లో చూసేది చాలా తక్కువ అనిపిస్తుంది.

**మిక్కీ మౌస్ నృత్యాలు**

జనం గుమిగూడిన ఒక థియేటరు ముందు మిక్కీ మౌస్ వేషాలు వేసుకున్న కళాకారులు వచ్చి చిత్ర విచిత్రంగా డాన్సులు చేస్తూ ప్రేక్షకుల్లో కలిసిపోయి పిల్లల్ని ఎత్తుకుంటూ నృత్యం చేస్తూ ఆనందం పంచుతారు. ఇంతవరకు టీవీలో చూసిన బొమ్మలకే పరిమితమైన చిన్నపిల్లలు నిజ జీవితంలో వాళ్ల ముందుకు వచ్చి కలిసి ఆడుతున్నందుకు మరింత కేరింతల్తో కాలం గడుపుతుంటారు.

ఇంకొంచెం ముందుకు వెళ్తే ఎత్తైన కొండ వుంటుంది. వంద అడుగుల ఎత్తులో ద్వారం ఉంటుంది. పర్యాటకులు ఎక్కిన పడవ అందులోంచి వేగంగా కిందకు దూకుతుంది. అలా దిగిన పడవ నీటి కాలువలో ప్రయాణించి మళ్ళీ కొండెక్కి ద్వారం గుండా కిందకు దూకుతుంది. ఆశ్చర్యంగా వుంటుంది, భయం కలిగిస్తుంది. దీనికి చక్కని రక్షణ ఏర్పాట్లున్నాయి.

అసలు కార్యక్రమమంతా మధ్యాహ్నం మూడున్నర గంటలకు. ఉదయం నుండి ప్రదర్శించబడిన మిక్కీమౌస్, లూనీటూన్స్, బ్యాట్‌మేన్, స్పైడర్ మ్యాన్, సూపర్‌మ్యాన్‌లు ఏకంగా బారులు తీరి కూర్చున్న పర్యాటకుల మధ్యకు వచ్చి హావభావాలు ప్రదర్శించి సెలవు తీసుకోవటం సందర్శకులకు మరుపురాని సన్నివేశం. మదిలో గూడుకట్టుకునే సంఘటన.

**డాల్ఫిన్ల ఆటలు... పాటలు...**

అక్కడక్కడా సినిమా సెట్టింగుల భవనాలు, గుడిసెలు ఉన్నాయి. చక్కటి నైపుణ్యంతో నిర్మించిన గుడిసెలు సందర్శకులను ఆకట్టుకుంటాయి. దీనికి నిర్వాహకులు హాలీవుడ్ అని పేరు పెట్టి సార్థకం చెయ్యటం అభినందనీయం. మనసుకు ఆహ్లాదం కలిగించే శక్తి సముద్రానికి వుంటుంది. అలాంటి సముద్రం థీమ్‌తో చేసినదే 'సీ వరల్డ్'. ఇది 1958లో ప్రారంభించడింది. ఇక్కడ సీల్ చేపలు ఎన్ని ఆటలు ఆడవచ్చో అన్ని ఆడ్తాయి. ఈ ఆటలన్నీ మనిషే

వయొలిన్‌తో ఆకట్టుకుంటూ...


డాల్ఫిన్ల విన్యాసాలు

కారు డ్రైవింగ్ స్టంట్లు

ఆడిస్తాడు. డాల్ఫిన్‌ల విన్యాసాలు మనిషితో పోటీ పడతాయి. కొలను ఈ చివరి నుండి ఆ చివరి వరకు వెళ్లికిలా, బోర్లా పక్కకు తిరిగి నలభై మైళ్ళ వేగంతో ఈత గొడతాయి. నీటిలోంచి దాదాపు పది అడుగుల ఎత్తుగా లేచి నూట నలభై డిగ్రీల్లో శరీరాన్ని చుట్టూ కదుపుతూ కిందకు దూకుతాయి. మనుషులు రెండు డాల్ఫిన్ల వీపులపై కాళ్ళు మోపి గుర్రపు స్వారీ చేస్తారు. ఐదు డాల్ఫిన్‌లు ఒక్కసారి ఒకే డిగ్రీలో వంగి గింగరాలు తిరిగి నీళ్ళలోకి దూకుతాయి. ఇక్కడ విశేషమేమంటే ఒక్కో డాల్ఫిన్ ఒక్కో క్రీడను నిర్వహించాక, కార్యక్రమం నడుపుతున్న వ్యక్తి తన నడుముకున్న సంచి లోంచి ఒక్కో చేప పిల్లను డాల్ఫిన్ నోటికి అందిస్తుంటాడు. ఈ కార్యక్రమంలో అవ్వ, అమ్మ, బిడ్డ ఇలా మూడు తరాల డాల్ఫిన్లు వున్నాయని తెలిసింది. ఈ వింతను చూసి బయట పడకముందే మరో చోట సీల్ చేపలు చేసే వింతలు అన్నీ ఇన్నీ కాదు.ఈ కార్యక్రమం కథలాగా సాగుతుంది. ఒక వ్యాపారి దొంగతనంగా చేపలు పట్టి వ్యాపారం చేస్తుంటాడు. అతన్ని చాకచక్యంగా పట్టుకోవడమే ఈ కథ. దీన్ని రక్తి కట్టించటానికి సీల్ చేపలు ముఖ్య పాత్రలు పోషిస్తాయి. నవ్వమంటే నవ్వుతాయి. ముద్దు పెట్టమంటే పెడతాయి. తొడకొట్టమంటే కొడతాయి. పాడమంటే పాడతాయి. ఆవు గొంతులా వుంటుంది. అన్నీ చూశాక నటనలో మనుషులతో పోటీ పడితే సీల్ చేపలు ప్రథమ బహుమతి పొందుతాయనడంలో సందేహం లేదు. చివరగా 'ది ఎండ్ బోర్డు' సీల్ చేప మెడకు తగిలించుకుని ప్రేక్షకుల ముందు నిలబడి వీడ్కోలు చెబుతుంది. అప్పుడు చూడాలి పర్యాటకుల ఆనందం చప్పట్లు మిన్నంటుతాయి.

**జెట్ బోట్ విన్యాసాలు**

ఇకపోతే ఆ పక్కనే జరిగే జెట్ బోటు విన్యాసాలు అద్భుతం. నాలుగు జెట్ బోట్లు నూరు మైళ్ళ వేగంతో ప్రయాణిస్తూ విన్యాసాలు చేస్తాయి. ఒక్కసారి ఆకాశంలోకి పదిహేను అడుగుల ఎత్తుకు లేచి మూడుసార్లు పొర్లు దండాలు పెట్టి నీటిపై వాలతాయి. అతివేగంగా వచ్చి ఢీ కొట్టబోయే సమయంలో అత్యంత చాకచక్యంగా పక్కకు వాలటం చూసి ఒళ్ళు గగుర్పాటు చెందుతుంది.

ఆస్ట్రేలియా వాసులకు నీళ్ళను చూస్తే చెప్పలేని ఆనందం. ఈత కొట్టాలని, చేపలు పట్టాల ని, వాహ్యాళికి వెళ్ళాలని, ప్రయాణం చెయ్యాల ని. బ్రిస్బేన్ నదిపై కిలోమీటరుకు ఒక వంతెన కట్టబడింది. అన్నీ పడవలు ప్రయాణించ టానికి అనువుగా ఉంటాయి. సిటీ క్యాట్, సిటీ కూపర్ పేరుతో సిటీ బస్సుల్లా పడవలు స్టేజి స్టేజికి తిరిగి ప్రయాణీకుల్ని చేరవేస్తుంటాయి.

**అడిగోపుల వెంకటరత్నమ్**

**ఫోటోలు: శ్రీకాంత్**

# కదిలే వనమూ...

**కా**రు తోలే వాళ్ల కళ్లన్నీ కాంక్రీటు వనాల మీదే వుంటాయనుకోవడం పొరబాటు. చుట్టూ పచ్చగా వుండాలనీ మొక్కల మధ్యే గడపాలనీ కోరుకునేవారూ వుంటారు. అలాంటి వారిలో కోల్‌కతాకు చెందిన ధనంజయ్ చక్రవర్తి ఒకరు. ఈయన కావడానికి ట్యాక్సీ డ్రైవరే అయినా మొక్కలు నాటాలనీ, పెంచాలనీ ఆశ. బాగా ఆలోచించి తన కారునే కదిలే వనంగా మార్చేశాడు.

ధనంజయ్ చక్రవర్తి ఓ ట్యాక్సీ డ్రైవర్. ఓసారి అంతర్జాలంలో శోధిస్తున్న అతని మిత్రులను ఓ కారు విశేషంగా ఆకట్టుకుంది. మరి కారు మీద, లోపల అంతా పచ్చటి మొక్కలతో నిండి వుండడం విశేషమే కదా. మొక్కలంటే ప్రాణమిచ్చే తమ స్నేహితుడు ధనంజయ్‌కు ఆ వింతైన కారును చూపించి... అతన్ని కూడా ఓ ప్రయోగం చేయమని ప్రోత్సహించారు. అంతే... 22 వేల రూపాయలు ఖర్చు చేసి కారు పై భాగాన్ని పచ్చటి తోటలా మార్చేశాడు. ముందుగా ఒక ఇనుప ట్రేను తయారుచేయించాడు. అందులో మట్టి, తెల్లటి ఇసుక, రాళ్లు పోసి... ఆ పైన గడ్డి నాటాడు. శ్రద్ధగా క్రమం తప్పకుండా నీళ్ల పోస్తుండడంతో అది ఏపుగా పెరిగి పలువురినీ ఆకట్టుకుంది. ఓసారి ట్యాక్సీ ఎక్కిన మహిళలెవరో ఓ పూల కుండీని మర్చిపోయి వెళ్లిపోయారు. దాంతో మరో ఆలోచన వచ్చిందతనికి. అలాంటి ఐదారు క్రోటన్ మొక్కల కుండీలను కారు వెనక భాగంలో అద్దం దగ్గర ఏర్పాటు చేశాడు. ఇవి కాక... డ్రైవింగ్ సీటు దగ్గర గడ్డి నాటిన చిన్న ట్రేను బిగించాడు. ఇంత చేసినా అతనికేదో వెలితిగా అనిపించి కారు చుట్టూ పల్లెటూరి వాతావరణాన్ని ప్రతిబింబించే బొమ్మలను వేయించాడు.

తోటి ట్యాక్సీ డ్రైవర్లు కొందరికి ఇదంతా నవ్వులాటగా అనిపించినా...అతని యజమాని మాత్రం సాధ్యమైనంత సాయం చేయడమే కాక ధనంజయ్‌ను ప్రోత్సహించాడు. దాంతో ఇప్పుడా కదిలే వనం లాంటి కారు నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ✦

వారిది ధనమదం. వీరిది పేదరికం. కుటుంబంలో ఏ పెద్ద ఖర్చు వచ్చినా వారి ముందు చెయ్యి చాచక తప్పని దైన్యం వీరిది. ఎన్ని షరతులు విధించినా తల దించుకొని తమ కాళ్ల దగ్గరకే వస్తారన్న ధైర్యం వారిది. ప్రాణాల మీదకొచ్చినా చచ్చినట్టు అప్పు చేయాల్సిందేనన్న షరతులు వారివి. కాదని అడుగు ముందుకు వేస్తే ఎక్కడ వెలి వేస్తారోనని వణికిపోయే దుర్భల జీవితాలు వీరివి. ఇంతకాలం ఇదే నడిచింది. ఇటీవలే ఆరుగురు మహిళలు సాహసం చేశారు. ధనమదాందులు గీచిన షరతుల గీతను దాటారు. అదే వారు చేసిన నేరంగా పేర్కొంటూ జరిమానాతో పాటుగా గ్రామం నుంచి వెలి వేసేశారు. ఇంతకీ ఆ మహిళలు చేసిన నేరమేంటి?!



# వెలి వేసేంత నేరమా !

షేప్లిఖేడ... ఉత్తర ప్రదేశ్‌లో చిన్ని గ్రామం. దేశ రాజధానికి కేవలం 60 కిలోమీటర్ల దూరంలోనే వుంటుంది. బాగా వెనుకబడిన 'నట్' తెగకు చెందిన 200 కుటుంబాలు ఆ గ్రామాన్నే నమ్ముకున్నాయి. వీరిలో అత్యధికులు నిరుపేదలు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వారు. ఈ తెగలో కొందరు మాత్రం బాగా డబ్బు సంపాదించి వడ్డీలకు అప్పులిచ్చే స్థాయికి ఎదిగారు. తెగ పెద్దల అవతారమెత్తి తీర్పులు ఇవ్వసాగారు. నట్ తెగ మహిళలు కేవలం నాలుగు గోడల మధ్యనే వుండాలి. వంటా వార్పు మాత్రమే చేయాలి. బయట పనికి వెళ్లకూడదన్నది అలా పుట్టుకొచ్చిన షరతే! భర్తలు వ్యవసాయం చేస్తూ ... అప్పుల పాలైనా... అనారోగ్యంతో ఆస్పత్రిపాలైనా...మరేం జరిగినా...మగవాళ్లు మాత్రమే పని చేయాలి. మహిళలు నాలుగు గోడల మధ్యనే మగ్గిపోవాలి.

ప్రేమ్‌వతి, ఓంబిరి, గీత, రేఖ, సుమన్, పింకీ... పలు కారణాలతో అప్పుల పాలైనవారే. ప్రేమ్‌వతి కుమార్తెకు పెళ్లి కుదిరింది. భర్త యశ్‌పాల్ పని చేయలేని స్థితిలో వున్నాడు. దాంతో ఖర్చుల కోసం లక్షా యాభై వేల రూపాయలు అప్పు చేసింది. రెండేళ్ల కిందట రేఖ యాభై వేల రూపాయల రుణం చేయాల్సి వచ్చింది. ఆమె కేవలం పది వేలు మాత్రమే తిరిగి చెల్లించగలిగింది. ఓంబిరి భర్తకు జబ్బు చేయడంతో అప్పు చేయక తప్పలేదు. మొత్తం మీద ఈ ఆరుగురు మహిళలు వడ్డీ వ్యాపారుల దగ్గర మూడు లక్షల రూపాయలు బాకీ పడ్డారు. ఓ వైపు వడ్డీ రోజురోజుకూ పెరిగిపోతోంది. మరోవైపు ఆదాయం వచ్చే మార్గం లేకపోయింది. తెగ పెద్దల షరతులను, అణచి వేత ను సహించలేకపోయారు. వందకు పన్నెండు రూపాయల చొప్పున వడ్డీలకు వడ్డీలు కట్టుకుంటూ అప్పుల ఊబిలో వుండలేకపోయారు. ఆరుగురూ కలిసి...సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. అది అప్పటి వరకు ఎవ్వరూ చేయనిది. చూడనిది.

ఆ ఆరుగురు ఆడవాళ్లు.... గట్టిగా కళ్లు మూసుకుని ... ఊపిరి బిగబట్టి ... తాము ఎదుర్కొంటున్న కష్టాలను మననం చేసుకున్నారు. అదే సమయంలో తెగ పంచాయతి గీసిన గీతను దాటితే జరిగే పరిణామమేంటో కూడా ఊహించుకున్నారు. కలసి కట్టుగా గుమ్మం దాటారు. తర్వాత ఊరు దాటారు. సమీపంలో వున్న పేపరు మిల్లులు, మాంసం పరిశ్రమల్లో పనికి కుదిరారు. రోజంతా చెమటోడ్చి ఎంతోకొంత మిగుల్చుకొని అప్పులు తీర్చాలనుకున్నారు.

**సహించలేకపోయారు**

ఆడవాళ్లు బయటికెళ్లి పని చేసి ఆర్థికంగా స్వతంత్రులు కావడం చూసిన తెగ పెద్దలు ఉగ్రులయ్యారు. ఇవాళ ఈ ఆరుగురినీ అనుమతిస్తే రేపు అరవై మంది గుమ్మం దాటతారు. ఆ తర్వాత ఊళ్లో వున్న మహిళలంతా పనులకు బయల్దేరతారని భయపడ్డారు. అది తమ వడ్డీ వ్యాపార సామ్రాజ్యాన్ని కూకటి వేళ్లతో సహా పెకల్చి వేస్తుందని వణికిపోయారు. దీనికితోడు వారిలో నరనరానా జీర్ణించుకున్న పితృస్వామిక భావజాలం మహిళలు వేసిన ముందడుగును స్వాగతించ లేకపోయింది. దాంతో కొత్త ఆలోచన చేసిన మహిళలకు కఠిన శిక్ష విధించడం ద్వారా మిగతా ఆడవాళ్లను సైతం కట్టడి చేయాలనుకున్నారు.

ముందుగా పంచాయతీ పెట్టి ... ఫ్యాక్టరీల్లో పని చేయకూడదని...ఆరుగురికీ ఉత్తర్వులు జారీ చేశారు. వారు దాన్ని లెక్కచేయకుండా పనులకు వెళ్లడంతో... గ్రామం నుంచి వెలివేశారు. ఊళ్లో ఎవరూ వారితో మాట్లాడకూడదు. ఏ విధమైన సాయం చేయకూడదని ఆజ్ఞాపించారు. ఒకవేళ ఎవరైనా ఈ తీర్పును ధిక్కరిస్తే వారికీ ఇదే గతి పడుతుందని హుకుం జారీ చేశారు. ఆ క్షణం నుంచి వారికి సరుకులు, పాలు, మంచినీళ్లు.....అన్నీ బంద్ అయ్యాయి. అన్నిటినీ మించిన విషాదం మరొకటుంది. వారు తిరిగి తెగ సభ్యులు కావాలంటే...మనిషికి లక్ష రూపాయల చొప్పున జరిమానా చెల్లించాలట. అందరూ చూస్తుండగా వంద కొరడా దెబ్బలు తినాలట.

తెగ పెద్దలవి రాతి హృదయాలైనా... ఇరుగు పొరుగు గ్రామస్తులు, స్థానిక అధికారులు ఆరుగురు మహిళలను ఆదుకున్నారు. సాయం చేస్తామని పోలీసులు మాటిచ్చారు. తమకు వ్యతిరేకంగా నడుచుకున్నందున కోపోద్రిక్తులైన తెగ పెద్దలు హింసకు పాల్పడిన ఘటనలు కూడా వుండడంతో అవసరాన్ని బట్టి వారిని వేరే గ్రామాలకు పంపించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇదిలా వుండగా... ఒకానొక తెగపెద్దను పోలీసులు ప్రశ్నించగా... బయట ఫ్యాక్టరీలకు పనులకెళ్లిన మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నందున...ఆ ఆరుగురినీ గ్రామం దాటి వెళ్లొద్దన్నామని చెప్పుకొచ్చారట.

మహిళలకు తెగ పెద్దలు కఠినమైన శిక్ష విధించినప్పటికీ ఆ ఆరుగురికీ ఇతర ఆడవాళ్ల మద్దతు వుంది. కాకపోతే వాళ్లలాగా బైటపడి పనులకెళితే... తాము కూడా వెలి వేయబడ తామన్న భయం వారిని ఆపివేస్తోంది. కానీ వారిలోని ఆలోచన బలపడితే మాత్రం అడుగు ముందుకే పడుతుంది. ✦

# పప్పుతో ఓ పట్టు పడదాం

## దోసకాయ పప్పు

**కావలసిన పదార్థాలు**

కందిపప్పు-1 కప్పు, దోసకాయ ముక్కలు-ఒకటిన్నర కప్పు, ఉల్లిపాయ-1, టమోటా-1, పసుపు-పావు టీ స్పూన్, నీళ్ళు- 2 కప్పులు, పచ్చి మిర్చి- 3,

**పోపు కోసం**

ఆవాలు, జీలకర్ర-1 టీ స్పూన్, వెల్లుల్లి, ఎండు మిర్చి-2, కరివేపాకు-2 రెబ్బలు, నూనె-2 టీ స్పూన్లు,

**తయారు చేయు విధానం**

కందిపప్పు, ఉల్లిపాయ, దోసకాయ, టమోటా ముక్కలు, పచ్చి మిర్చి, పసుపు, 2 కప్పుల నీళ్ళు కలిపి కుక్కర్‌లో పెట్టి 3 విజిల్స్ వచ్చేంత వరకు ఉడకబెట్టాలి. ఆ తరువాత మరొక పాత్రలో నూనె వేసి వేడయ్యాక ఆవాలు, జీలకర్ర వేసి చిటపటలాడించాలి. వెల్లుల్లి, ఎండుమిర్చి, కరివేపాకు వేసి అర నిమిషం పాటు వేయించాలి. తరువాత ఉడకబెట్టుకున్న పప్పు మిశ్రమాన్ని వేసి కలియబెట్టి సిమ్ మీద అయిదు నిమిషాలుంచి దింపేయాలి.

## టమోటో పప్పు

**కావలసిన పదార్థాలు**

కందిపప్పు-ఒక గ్లాసు, టమోటాలు-6, పచ్చిమిరపకాయలు-5,

**తాలింపు కోసం**

జీలకర్ర- ఒక టీ స్పూను, ఆవాలు-ఒక టీ స్పూను-ఎండు మిరపకాయలు-5, నూనె-తగినంత, పసుపు-చిటికెడు, ఉప్పు-తగినంత, కారం-ఒక టీ స్పూను, కరివేపాకు-ఒక రెమ్మ, కొత్తిమీర- ఐదు రెమ్మలు

**తయారు చేయువిధానం**

ముందుగా ఒక గిన్నెలో శుభ్రంగా కడిగిన కందిపప్పు, టమోటోలు, పచ్చి మిరపకాయలు వేసి రెండు గ్లాసులు నీళ్ళు పోసి కుక్కర్‌లో పెట్టి నాలుగు విజిల్స్ వేయించి దింపేయాలి. ఆ తరువాత గిన్నెలో నూనె పోసి కాగిన తరువాత తాలింపు దినుసులు వేసి గోధుమ రంగు వచ్చే వరకూ వేయించాలి.

ఆ తర్వాత ముందుగా కుక్కర్‌లో ఉడకబెట్టుకున్న పప్పు, టమోటాల మిశ్రమాన్ని గరిటతో బాగా మెత్తగా అయ్యే వరకూ మెదిపి ఆ మిశ్రమాన్ని తాలింపులో వేసి పసుపు, ఉప్పు, కారం వేసి మరోసారి కలియబెట్టాలి. తరువాత కరివేపాకు, కొత్తిమీర వేసి గార్నీష్ చెయ్యాలి. ఘుమఘుమలాడే టమోటో పప్పు రెడీ.

## పాలకూర పప్పు

**కావలసిన పదార్థాలు**

పాలకూర-2 కట్టలు, కందిపప్పు-ఒక గ్లాసు, టమోటాలు-3, పచ్చి మిరపకాయలు-5, ఉల్లిపాయలు-2, చింతపండు-50 గ్రాములు, జీలకర్ర, ఆవాలు-ఒక టీ స్పూను, ఎండు మిరపకాయలు-5, నూనె-తగినంత, పసుపు- చిటికెడు, ఉప్పు, కారం-తగినంత, ధనియాల పొడి- ఒక టీ స్పూను, కరివేపాకు-ఒక రెమ్మ

**తయారుచేయు విధానం**

కందిపప్పును కుక్కర్‌లో 3 విజిల్స్ వచ్చే వరకూ ఉడికించి పక్కన ఉంచుకోవాలి. ఆ తర్వాత మరో పాత్రలో నూనె పోసి వేడయ్యాక పచ్చి మిర్చి, ఉల్లిపాయలు వేసి దోరగా వేయించి, దానిలో తరిగిన పాలకూర, టమోటో ముక్కలను కలిపి 5 నిమిషాలు పాటు వేయించి దానిలో ఉప్పు, కారం, చింతపండు రసం, పసుపు, ధనియాల పొడి ఉడికించాలి. ఆ తర్వాత తాలింపు కోసం మరొక పాత్రలో నూనె పోసి దానిలో ఆవాలు, జీలకర్ర, కరివేపాకు, ఎండు మిర్చి, శనగపప్పు, వెల్లుల్లి వేసి పోపు పెట్టి దానిలో ఉడికించుకున్న పప్పు మిశ్రమాన్ని తిరగబోసి బాగా కలియబెట్టాలి.

## గోంగూర పప్పు

**కావలసిన పదార్థాలు**

గోంగూర-1 కట్ట, కందిపప్పు-1 కప్పు, ఉల్లిపాయలు-2, పసుపు-పావు టీ స్పూన్, పచ్చి మిరపకాయలు-5, ఉప్పు-తగినంత, నూనె-తాలింపుకు సరిపడా, తాలింపు సరుకులు-రెండు టీ స్పూన్స్, (జీలకర్ర, ఆవాలు, వెల్లుల్లి) , కరివేపాకు- రెండు రెబ్బలు.

**తయారు చేసే విధానం**

ముందుగా పొయ్యి మీద పాత్రను పెట్టి పప్పు పోసి దానిలో నీళ్ళతో బాగా ఉడకనివ్వాలి. ఈ లోపు గోంగూరను శుభ్రంగా కడిగి చిన్నగా తరుగుకుని పక్కన ఉంచు కోవాలి. ఇప్పుడు వేరే పొయ్యి మీద గిన్నె ఉంచి నూనె పోసి కాగనిచ్చిన తర్వాత జీలకర్ర, ఆవాలు, వెల్లుల్లి, ఉల్లిపాయ ముక్కలు, పసుపు, పచ్చి మిరపకాయ ముక్కలు కలిసి వేయించుకోవాలి. బాగా వేగిన తర్వాత కత్తిరించి ఉంచుకున్న గోంగూరను వేసి వేయించి కొంచెం చిన్న మంట మీద మగ్గనివ్వాలి. గోంగూర మగ్గాక ఉడకబెట్టిన పప్పును గోంగూర మిశ్రమంలో తిరగబోసి కలియబెట్టి పదినిమిషాల తర్వాత దించుకోవాలి. గోంగూర పప్పు రెడీ.



గోదావరి నీళ్ళు తాగినవారందరూ ఏదో ఒక కళలో తమ ప్రత్యేకతను చాటుకుంటూనే వచ్చారు. అందునా కాకినాడ కళలకు పుట్టినిల్లు. కాకినాడలో సినిమా రోడ్.. సంత చెరువు దగ్గర మెజిస్టిక్ థియేటరు. ఈ థియేటరు యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ వారి సొంతం. సి.పుల్లయ్య, బి.ఎ.సుబ్బారావు, ఆదినారాయణ రావు, ఆకుల నరసింహారావు, అంజలీదేవి, హరనాథ్, యస్.వి.రంగారావు, సుబ్బలక్ష్మి, సుబ్బురాజు, కాకినాడ శ్యామల, కల్పనారాయ్.. ఇంకా ఎందరో దిగ్గజాలను అందించిన వేదిక యంగ్‌మెన్ హ్యాపీ క్లబ్. సి.పుల్లయ్య, బి.ఎ.సుబ్బారావుల సహచరుడు రేలంగి వెంకటరామయ్య, పుట్టింది రావుపాలెం అయినా పెరిగింది కాకినాడలో. చిన్నతనంలో నాటకాల పిచ్చి. జోగనాథం గారికి ఆ రోజుల్లో కాళ్ళకూరి నారాయణరావు నాటకం 'చింతామణి'లో విశేషమైన పేరు ప్రఖ్యాతలు పొందివున్నారు. ఆయన ప్రభావం రేలంగి మీద చాలా వరకు వుందని ఆయనే చెబుతుంటాడు. రేలంగి స్వతహాగా హరికథా భాగవతార్ గనుక పాట మీద హార్మోనియం వాద్యం మీద గట్టి పట్టు వుండేది.

# హాస్యానికి లాస్యం

ఆ రోజుల్లో సినిమా కళాకారులకు హిపోక్రసీ ఉండేది కాదు. రంగస్థల కళాకారుల్ని గౌరవంగా చూసేవారు. దర్శక పితామహుడు సి.పుల్లయ్య గారి థియేటరు మినర్వా మెజిస్టిక్ థియేటరు పక్కనే ఉండేది. ఆయన రేలంగిలోని హాస్య చతురత,బుద్ధికుశలత గమనించి తనతో బాటు చెన్నపట్నం తీసుకెళ్ళాడు. మొట్టమొదటిసారిగా 'శ్రీకృష్ణ తులాభారం' చిత్రంలో హాస్య విదూషకుడి పాత్ర ధరించి పలువురిని ఆకర్షించాడు. సి.పుల్లయ్య గారి ప్రొడక్షను వ్యవహారాలు తానే స్వయంగా చూసుకుంటుండేవాడు. గొల్లభామ చిత్రం కోసం అంజలీదేవిని పరిచయం చేసింది రేలంగి గారే. 'గొల్లభామ' చిత్రం పెద్ద హిట్. తొలి రోజుల్లోనే రేలంగిని 'పక్కింటి అమ్మాయి' చిత్రం ద్వారా అంజలీదేవి సరసన హీరోగా చేయించి అఖండ విజయాన్ని చేకూర్చాడు.

తెలుగు సినిమా చరిత్రలో తొలి తెలుగు స్టార్ కమెడియన్ కస్తూరి శివరావు అయితే ఆ స్టార్ కమెడియన్‌కి గ్లామరూ గ్రామరూ నేర్పింది నిర్ద్వందంగా రేలంగి గారే.. తను నటించే పాత్ర ఏదైనా ఆ పాత్ర తనలో ఒదిగిపోయేలా తపించేవాడు. 'కీలుగుర్రం, గుణ సుందరి కథ, మన దేశం, పరమానంద శిష్యుల కథ, జయసింహ, అర్ధాంగి,రోజులుమారాయి, చింతామణి, సారంగధర, మామకు తగ్గ అల్లుడు, వాగ్దానం, శభాష్ రాజ్, పెళ్ళి కానుక, మాంగల్య బలం...' ఏ సినిమాలో నటించినా ఆ సినిమా సూపర్ హిట్ అయి తీరాల్సిందే!

### డిస్ట్రిబ్యూటర్స్ ఫస్ట్ చాయిస్

అది తెలుగు సినిమాలో స్వర్ణయుగం. నిర్మాత, దర్శకుడు పంపిణీదారుడు ఈ ముగ్గురే చిత్ర నిర్మాణం విషయంలో ప్రణాళిక సిద్ధం చేసుకునేవారు. కథ, కథని బట్టి దర్శకుడు ..కథ ప్లస్ దర్శకుడ్ని బట్టి బడ్జెట్ ..ఆ బడ్జెట్‌లో తన ఎంత పెట్టుబడి పెడుతున్నది. పంపిణీదారుడు ఎంత మొత్తం పెట్టనున్నదీ..ఒక ఒప్పందానికి వచ్చిన తరువాత సినిమా ప్రారంభమైతే సినిమా విడుదల వరకూ వెనక్కి తిరిగి చూసుకోవలసిన పనిలేదు. ఇటువంటి రోజుల్లో పంపిణీదారుడు నిర్మాత దర్శకుల్ని అడిగే మొదటి ప్రశ్న మీ సినిమాలో రేలంగి ఉన్నాడా? వుంటే ఆ సినిమాకి పెద్ద భరోసా. సినిమా కచ్చితంగా వసూళ్ళు చేస్తుందన్న నమ్మకం రేలంగిని చూడ్డానికి బళ్ళు కట్టుకుని వచ్చేవారు. అంత పెద్ద సంఖ్యలో అభిమానులుండేవారు. సావిత్రమ్మ తర్వాత పెద్ద మొత్తంలో పారితోషికం తీసుకున్న నటుడు రేలంగే. పాత్ర కూడా హీరోలతో సమాన స్థాయిలో వుండాలి. గౌరవ మర్యాదల విషయంలో కూడా సరిసమానమైన గౌరవాన్ని పొందగలిగాడు. అది డిమాండ్ చేసి పొందలేదు. ప్రేమతో సాధించుకున్నాడు. తొలి రోజుల్లో రేలంగి సరసన ఎక్కువ చిత్రాల్లో నటించింది సూర్యకాంతమ్మ.

### సూపర్ హిట్ జంట

తెలుగు సినిమాల్లో వేగం పెరిగింది. పాటలు, నృత్యాలూ, గ్లామరూ పెరిగింది. దాంతో రేలంగి గిరిజ నటించడం తప్పని సరైంది. మాంగల్యబలం

## చిన్నారుల నుంచే ...

"నేను తొలి రోజుల్లో జోగినాథం గార్ని కొంత వరకు ప్రేరణగా తీసుకున్నా.. చిన్న పిల్లల్ని ఎక్కువగా గమనించేవాడ్ని. ఏ హాస్యనటుడికైనా చిన్నపిల్లల హావభావాల్లోంచి కనిపించిన 'నటన' ఆకళింపు చేసుకోగలిగితే తెర మీద అద్భుతాలు సృష్టించవచ్చు. తెలిసీ తెలియని వయస్సులో మాయ మర్మం లేని మాటలు వారివి. స్వచ్ఛమైన గంగాజలంలా వాళ్ళ మాటలు వుంటే నేను నా జీవితంలో అత్యధిక భాగం చిన్నపిల్లలను కదిలించి కవ్వించి ...నవ్వించి ...వాళ్ళు కనపరిచిన హావభావాలను చూసి నేర్చుకున్నదే ఎక్కువ. రెండవది ప్రతి మనిషిలోనూ ఏదో ఒక లోపం వుంటుంది. నేను పొడుగాటి డైలాగులు చెప్పలేను. అలాగని వదిలెయ్యను. సాధ్యమైనంత వరకూ సింప్లిఫై చేసి చెప్తాను. మిగతా వారి సంభాషణలు కంటే నా సంభాషణలకే ఎక్కువ రెస్పాన్స్ వచ్చిన సందర్భాలు చాలా ఉన్నాయి. రెండవది దీర్ఘ సమాసాలు అవీ నా ఒంటికి పడవు. కవిగారితో కూర్చొని వ్యవహారికంగా "ఇలా చెబితే ఎలా ఉంటుందో చూడండి". అని చెప్పి ఆయన ముఖంలో కనిపించే స్పందనని బట్టి ఆ డైలాగుని చెప్పేవాడ్ని. అలాగే నా నడక, నడవడిక పాత్రకి తగ్గటుగా మార్చుకున్నాను. ప్రేక్షకులు ఆదరించారు." అని రేలంగి ఓ సందర్భంలో చెప్పుకున్నారు.

లాంటి చిత్రాల్లో ఆనాటి హీరోయిన్ సులోచనతో నటించి 'ఆకాశ వీధిలో అందాల జాబిలి' పాడిన రేలంగి గిరిజతో 'సరదా సరదా సిగిరేట్టు... ఇది దొరలు తాగే సిగరేట్టు పాడాడు.( రాముడు, భీముడు)లో. అప్పటికే హీరోయిన్ కావలసిన పర్సనా లిటి గిరిజలో ఉండేది. డాన్సు చక్కగా చేసేది. వేషధారణలో కూడా హీరోయిన్‌తో సమానంగా సింగారిం చుకునేది. 'కాశీకి పోయాను రామ హరీ,గంగ తీర్ధంబు తెచ్చాను రామ హరీ.. పిల్లోయ్ జాగ్రత్త ... నానూ జాగరత ... కంటె జాగరత ... ఇలాంటి ద్వంద్వార్థాల పాట ఆ రోజుల్లో సంచలనాలు సృష్టించింది. సెట్‌లోనూ బయటా మంచి అవగాహన వుండేది. రేలంగి ఏం చేస్తాడో ఎటువంటి రియాక్షన్సు ఇస్తాడో గిరిజకు తెలుసు. ఒక విధంగా గిరిజ రేలంగిని గురువుగా చెప్పుకుంటుంది. డైలాగు చెప్పడంలో టైమింగ్ వారి దగ్గరే నేర్చుకున్నానం టుంది. రేలంగి పిలిచాడంటే ఎందుకూ? ఏమిటీ? అని అడక్కుండా కారెక్కి వెళ్ళిపో వాల్సిందే. అలా అర్ధరాత్రి పూర్తి చేసిన చిత్రమే 'లవకుశ' లోని ఓ పాట 'ఒల్లనోరి మావా నీ పిల్లని'. అలాగే నాలుగ్గంటల్లో 'వెయ్యర దెబ్బ.. దరువెయ్యర దెబ్బ' పాట సినిమా విడుదలకి ముందు డిస్ట్రిబ్యూటరు 'కామెడీ అస్సలు లేదు. ఎలా'? అని ఏరి కోరి రెండు పాటల్ని 'లవకుశ' చిత్రంలో జొప్పించారు. ఆ చిత్రం అఖండ విజయం సాధించింది. ఇక్కడో విషయం మనం గమనించాలి ప్రొడ్యూసర్ని కాపాడుకోవాలి. అందుకోసం డబ్బు మాత్రమే కాక తమ ఆరోగ్యం సైతం లెక్కచేయకుం డా పని చేసేవారు రేలంగి. ఎన్.టి.ఆర్ 'బావా' అని పిలిచేది రేలంగినే!

**సంచలన విజయాలు**

శ్రీకృష్ణ తులాభారం, వర విక్రయం, గొల్లభామ, కీలు గుర్రం, సంసారం, షావుకారు, పాతాళభైరవి, పెద్ద మనుషులు, భాగ్యరేఖ, దొంగల్లో దొర, మాయాబజార్, సువర్ణ సుందరి, చెంచు లక్ష్మి, అప్పు చేసి పప్పు కూడు, సిరిసంపదలు, పెళ్ళి కానుక, రక్త సంబంధం, కుల గోత్రాలు, భీష్మ, నర్తన శాల, ఆరాధన, నవరాత్రి, ఆస్తిపరులు, అంతస్థులు, ప్రైవేటు మాస్టారు, ప్రేమించి చూడు, గూఢచారి 116. ఆడపడుచు, మాతృదేవత, గంగ-మంగ, ఇద్దరు మిత్రులు, తోడికోడళ్ళు... ' చిత్రాలను తెలుగు ప్రేక్షకుడు మరిచిపోలేడు.

ఆ రోజుల్లో స్క్రిప్టులో వున్న డైలాగుని సెట్‌లో మార్చడానికి ఎవరూ ఒప్పుకొనేవారు కారు. ముఖ్యంగా కె.వి. రెడ్డి, ఆదుర్తి, ఎల్వీప్రసాద్, సి.పుల్లయ్య. అయినా రేలంగి అప్పటికప్పుడు ఏదో పిచ్చి డైలాగు చెప్పేవాడు. అది ఆ సన్నివేశానికి అతికినట్టు సరిపోయేది. జంబలకిడిపంబ, వండర్ మే తండర్, గోవిందో హరి, ఓహో ఇంటి ఇల్లాల, వీడెవడండీ బాబు. ఆ మాటలు ప్రేక్షకుల నోళ్లల్లో నానుతుండేవి. డైలాగు నిడివి తగ్గించి సూటిగా ప్రేక్షకుడికి హత్తుకునేలా చెప్పడం రేలంగికి చెల్లింది. రేలంగి పక్కన నటిస్తున్నప్పుడు హీరోలు సైతం భయపడేవారు. ఎక్కడ ఒక చిన్న రియాక్షన్‌తో కొట్టి పారేస్తాడోనని. అదీ రేలంగి ముద్ర!

**పాడి ... మెప్పించి...**

గుణసుందరికథలో 'అడివే ఎదురై వచ్చేదాకా పదరా ముందుకు పదరా', పాతాళ భైరవి చిత్రంలో 'వినవే బాలా నా ప్రేమ గోల', విప్ర నారాయణ

చిత్రంలో "ఆడది అంటే లయం లయం. ఆ నీడ అంటేనే భయం భయం', మిస్సమ్మ చిత్రంలో ధర్మం చెయి బాబు ..ధర్మం చెయి బాబు! ఇలా రేలంగి తెలుగు సినిమాకి తన వంతు సేవలందించి తీర్చిదిద్దాడు. రేలంగి మాట ఒక మంత్రం! రేలంగి పాట ఒక తంత్రం అనే వారు కొసరాజు. కొసరాజు పాటలకు ప్రాణ పతిష్ఠ చేసింది రేలంగి. 'అయ్యయ్యో చేతిలో డబ్బులు పోయెనే'... 'తగురా ఇది మామ ... తమరే ఇటు పలుకు నటుల తగునా ఇది మామా,' 'శివ గోవింద...గోవిందా'..ఇలా ఎన్నో అమృత గుళిక లు. తలచుకున్నప్పుడల్లా మధురం అనిపిస్తుంది.

**ఆయనకు ఆయనే సాటి**

ఇటు సూర్యకాంతమ్మ తోను అటు గిరిజ తోనూ రెండు షేడ్స్ ఉన్న పాత్రల్ని చేసి ఆనాటి యువతరాన్ని మెప్పించాడు రేలంగి. చిత్ర పరిశ్రమ బాగోగులను కోరుకున్న వ్యక్తి. ప్రొడ్యూసర్ల క్షేమం ముందు, తర్వాత తన లాభం. 1960లో "సమాజం "అనే చిత్రాన్ని నిర్మించి చేతులు కాల్చుకున్నాడు. అయినా గుప్త దానాలకు వెనుకాడలేదు. తన పేరిట తాడేపల్లి గూడెంలోనే ఒక డిగ్రీ కాలేజీ స్థాపనకు విరాళం ఇచ్చాడు. సినిమా మీద వ్యామోహంతో తాడేపల్లిగూడెంలోని వెంకట్రామయ్య థియేటరు నిర్మించాడు. 1973 తర్వాత చిత్రాల్లో చెయ్యలేకపోయాడు. కాలు మడవనియ్యలేదు, అనారోగ్యం. అప్పటికి పద్మనాభం ఓ వెలుగు వెలుగుతున్నాడు. రాజబాబు అప్పుడే రైజింగ్ స్టార్‌లా దూసుకొస్తున్నాడు. అయినా రేలం గిని పలకరించిన వాళ్ళు లేరు. స్వర్ణయుగపు సౌరభా ల్ని పంచుకున్నవాళ్ళు లేరు. పద్మశ్రీ (1970) అవార్డు పాతబడిపోయింది. తను ఎవరి దగ్గరకు వెళ్ళలేదు. ఎవరికీ తన దగ్గరికి వచ్చేంత తీరిక లేదు. ఇప్పట్లా నెట్‌లూ, సీడీలు లేవు. ఎప్పుడు అవసరమైతే అప్పుడు సినిమాలు చూసుకోవడానికి నిమిషాలు లెక్కపెడు తూ రోజులు గడపడం నరకం. ఆ నిరీక్షణలోనే నవంబరు 26 (1975)న చనిపోయారు. ఎందరు కమెడియన్లు వచ్చినా రేలంగికి సాటి రేలంగే! ✦

సేవ

**పావురానికి పట్టెడు గింజలు వేస్తారు. చిలకమ్మకు జాంపండును అందిస్తారు. కాకి దర్జాగా వంటింట్లోకి దూరి మరీ నచ్చినవి ఎగరేసుకుపోతుంది. కానీ, గుడ్లగూబను చూస్తే చీదరించుకుంటారు. గ్రద్ద వాలితే రాయి విసిరి చెదరగొడతారు. ఇక డేగలు, రాబందుల లెక్కలు కాలం చెల్లాయి. పక్షుల్లోను మనిషికి పక్షపాతాలున్నాయి. కానీ, ఎవరూ పట్టించుకోని ఈ రెండో జాతి పక్షుల బాగోగులు చూస్తున్నారు ఢిల్లీకి చెందిన నదీమ్ షెహజాద్, మహమ్మద్ సాద్. రెక్కలు తెగి, దెబ్బతిన్న వాటికి చికిత్స చేస్తున్నారీ వేట పక్షి ప్రేమికులు.**

# వేట పక్షులకు ఆప్తులు

కుటుంబ వ్యాపార వారసత్వంగా వచ్చిన ఫౌంటెయిన్ నాజిల్స్, సోప్ డిస్పెన్సర్లను తయారు చేసే ఈ అన్నదమ్ములు వీలు కుదుర్చుకుని మరీ పక్షులకు సాయం చేస్తున్నారు. ఢిల్లీ చావ్‌రీ బజార్‌లోని తమ ఇంటి పైకప్పునే షెల్టర్ చేసి, తమ ప్రాంగణాన్ని వాటికి ఆస్పత్రిగా మార్చి వేల వేట పక్షులకు ప్రాణం పోశారు.పదేళ్లుగా సేవల్ని అందిస్తున్నవారి దయ వల్ల బతికి రెక్కగట్టినవి 5000కు పై చిలుకే. డబ్బు సమస్య వేధిస్తున్నా వ్యాపార సమయాన్ని తగ్గించుకుని 24 గంటల పక్షి పరిరక్షణ సంస్థను ప్రారంభించారు. హీనంగా, భయంగా సమాజం పక్కకు పెట్టేసిన ఈ పక్షి జాతికి సేవలు అందిస్తున్నారు. వీటినే ఎంచుకోటానికి కారణం మిగతా పక్షులను ఏదో రకంగా చాలామంది దగ్గరకు రానిస్తారు. వాటికి నాలుగు తిండి గింజలు దొరికితే చాలు. కానీ గుడ్లగూబలు, గ్రద్దలు లాంటివి ఎక్కువగా మాంసాహారం మీదే ఆధారపడే బతుకుతాయి. వాటిని పెంచుకునే వారూ అరుదు. ఇక వాటికి దెబ్బతగిలితే రక్షించేవారు ఎక్కడ ఉంటారనేది ఆ అన్నదమ్ములకు ఓ ఘటన వల్ల ఎదురైన ప్రశ్న. 2003లో వీరికి దెబ్బతిన్న ఓ నల్లరెక్కల గ్రద్ద కనిపించింది. రక్తమోడుతూన్న అది ఎగిరేందుకు విఫల యత్నం చేస్తోంది. దారి వెంట వెళ్తున్న ఎవరూ దాన్ని అవస్థను పట్టించుకోవడం లేదు. దాని పరిస్థితి చూసి చలించిపోయిన వారు చాంద్‌నీ చౌక్‌లో ఉన్న జైన్ ఆలయంలోని పక్షి వైద్యశాలకు తీసుకుపోయారు. మాంసాహార పక్షి కావడం వల్ల దానికి అక్కడ చికిత్స చేసేందుకు వైద్యులు వ్యతిరేకించారు. ఏం చేయాలో పాలుపోని వారు దాన్ని తమ ఇంటికి తీసుకెళ్లి వైద్యున్ని పిలిపించి చికిత్స చేయించారు. ఆ తర్వాత వారికి అర్థమైంది ఆ తరహా పక్షుల్ని సమాజం పట్టించుకోదని. అప్పుడే నిర్ణయించుకుని ఆ తరహా వేట పక్షుల్ని సంరక్షించే బాధ్యత తామే తీసుకున్నారు.

తమ ఇంటి పైకప్పునే వాటికి షెల్టర్ చేసి వెదికి మరీ దెబ్బతిన్న వేట పక్షుల్ని కాపాడటం ప్రారంభించారు. గుడ్లగూబలు, గ్రద్దలు, డేగలు, అంతరించిపోతున్న రాబందుల్ని కాపాడి తిరిగి వాటిని వదిలేసేవారు. వీరి గురించి తెలుసుకున్న పక్షి సంరక్షణ సంస్థలు వీరి సేవల్ని వినియోగించుకునేవి. పక్షి చికిత్సలో ఏ మాత్రం అనుభవం లేకున్నా శ్రద్ధగా వాటిని నేర్చుకుని కొత్త ప్రయోగాలు చేయడం ప్రారంభించారు. కాలు విరిగిన వాటికి ఉక్కు తీగెలతో కృత్రిమ కాలిని అమరుస్తున్నారు. విరిగిన ఎముకల స్థానే ఉక్కు ముక్కల్ని ఉపయోగిస్తున్నారు. శరీరంలో కలిసిపోయే దారాన్ని వినియోగించి కుట్లు వేస్తున్నారు. శస్త్రచికిత్సల్ని చేస్తున్నారు. మందులూ స్వయంగా ఎంచుకుంటున్నారు. దీనికి కారణం సరైన పక్షి వైద్యుడంటూ ఎవరూ అందుబాటులో లేకపోవడం, ఉన్నవారికి వేట పక్షుల విషయంలో అవగాహన లేకపోవడం. రకరకాల వ్యవస్థల నుంచి సమాచారాన్ని సేకరించి చికిత్స పద్ధతుల్ని నేర్చుకున్నారు. ఏవీయెన్ ఆర్థోపెడిక్ సర్జరీల్లో మంచి పట్టు సాధించారు. కానీ, వారి వ్యాపారం ఆదరణ కోల్పోవడంతో ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ పక్షులను కాపాడేందుకు డబ్బు దొరకడం లేదు. పదేళ్లుగా సేవలు అందిస్తున్నా ఆర్థికంగా తగిన ప్రోత్సాహం అందలేదు. ఇప్పటి వరకు అయిన ఖర్చులో 95 శాతం వీరు తమ సొంత డబ్బునే వినియోగించారు. అయినా సరే వెనక్కు తగ్గడంలేదు. అంతర్జాతీయ ప్రమాణాల్లో పక్షి వైద్యశాలలను నిర్మించేందుకు శ్రమిస్తున్నారు. వీరి సేవల్ని గుర్తిస్తూ విప్రో ఎన్.ఎఫ్.ఎస్ స్పారో అవార్డు ఇచ్చింది.

✦

**నదీమ్ షెహజాద్**

స్ఫూర్తి

అనిత మీనన్

అనిత మీనన్ ఇపుడు స్టార్ మోడల్. ర్యాంప్ వాక్ చేసే మోడలే కాదు... డౌన్స్ సిండ్రోమ్‌ను ఓడించాలనుకునేవారికి రోల్ మోడల్. తాను మోడల్‌గా నడిచింది ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కాదు. సూపర్ మోడల్స్ సైతం ఆరాధించే ప్రఖ్యాత ఫ్రైడే ఫొటోగ్రాఫిక్ స్టూడియోలో. ఆమె ఇచ్చిన ఒక్కో పోజ్ డౌన్స్ సిండ్రోమ్‌ను ధిక్కరించేట్టుగా ఎంతో కాన్ఫిడెంట్‌గా ఉంది.

# స్ఫూర్తికి మోడల్

కేరళకు చెందిన ఇరవై రెండేళ్ల అనిత మీనన్ ఇప్పుడు యూఏఈ (యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్)లోని ఫ్యాషన్ మేగజైన్ల కథనాలకు సరిపడా గ్లామర్‌ను అందిస్తోంది. మనిషిని కుదేలు చేసే వ్యాధిని ఓడించి ప్రపంచంలోని వార్తా పత్రికల స్ఫూర్తి కథనాలకు సరిపడా గ్రామర్‌ను అందిస్తోంది. యూఏఈలో నెంబర్ వన్ ఫ్యాషన్ పత్రిక కోసం ప్రముఖ ఫొటోగ్రాఫర్ స్టెఫాన్ లిండేక్యూ తీసిన ఆమె ఫొటో షూట్ క్లైమాక్స్‌కు చేరేసరికి ఆమె జీవితంలో ఎన్నో మలుపులున్నాయి. పుట్టిన వారానికే అనితకు డౌన్స్ సిండ్రోమ్ ఉందని వైద్యులు తేల్చారు. ఈ వ్యాధి బారిన పడినవారు సాధారణ జీవితాన్ని అనుభవించలేరు. బుద్ధిమాంద్యం, శారీరక బలహీనత, మాటలు సరిగా రాకపోవడంతో పాటు ఎంత వయసు వచ్చినా వారిని చంటి బిడ్డల్లా చూసుకోవాల్సిందే. దీనికి తోడు ఆమె గుండెకు రెండు రంధ్రాలు ఉన్నాయని వైద్యులు నిర్ధరించారు. ఆమె ఎంతో కాలం బతకదని, అన్ని ఆరోగ్య సమస్యల మధ్య ఆమె మూడేళ్లు జీవించినా గొప్పే అని అనిత తల్లిదండ్రులు ఉష, రాందాస్‌లకు చెప్పారు. అనూహ్యంగా అనిత మూడో పుట్టిన రోజును జరుపుకుంది. తర్వాత గుండెకు ఆపరేషన్ చేయించుకుని కోలుకుని వైద్యుల్ని ఆశ్చర్యపరిచింది. కొన్నేళ్లకు, 1998లో రాందాస్‌కు యూఏఈలో అకౌంటెంట్‌గా ఉద్యోగం రావడంతో తనతో పాటు కుటుంబాన్ని తీసుకెళ్లాడు. అప్పటి నుంచి అల్ బర్షాలోని రషీద్ (పెడియాట్రిక్) థెరపీ సెంటర్‌లో ఇటు చదువును, అటు చికిత్సను తీసుకుంటోంది. ఐటీలో ప్రతిభ చాటిన ఆమెకు ప్రపంచానికి తన గురించి తెలిసేలా ఏదైనా గొప్ప విజయాన్ని సాధించాలనేది లక్ష్యం. కేరళలో బంధువుల పెళ్లికి వచ్చిన అనిత తోటి బంధువుల అమ్మాయికు మోడలింగ్‌పై ఆసక్తి ఉందని తెలిసింది. ఆమె పోర్ట్‌పోలియోకు సంబంధించిన మోడల్ షాట్స్ చూసి అనిత తాను కూడా మోడల్ అవ్వాలని నిర్ణయించుకుంది. తమ కుటుంబం ఇష్టంగా చదివే ఫ్రైడే ఫ్యాషన్ మేగజైన్‌లో తన చిత్రం కనిపించాలని సంకల్పించింది. ఇందుకు ఫ్యాషన్ డిజైనర్ కేరీ హ్యామర్ షో కూడా కారణం. తనలానే డౌన్స్ సిండ్రోమ్ బారిన పడిన జేమీ బ్రూయర్ అనే మహిళ ఫ్యాషన్ మోడల్‌గా, హాలీవుడ్ నటిగా ఎదిగిన క్రమాన్ని తెలుసుకుంది. ఇక క్షణం వృథా చేయలేదు. డౌన్స్ సిండ్రోమ్ వల్ల కాళ్లు సహకరించకున్నా వెనుకడుగు వేయలేదు. చాలా కష్టపడి ఫొటోషూట్‌కు కావాల్సిన కాన్ఫిడెంట్ లుక్స్‌ను, పర్సనాలిటీని సొంతం చేసుకుంది. ప్రతిభతో ఫ్రైడే ఫొటోగ్రాఫిక్ స్టుడియోలో అవకాశాన్ని పట్టేసింది. ఆ స్టుడియో దుబాయ్‌లోనే పేరుగాంచిన సూపర్ మోడల్స్‌కు అడ్డా. అత్యంత సుందరాంగులైె అమెజాన్ అందగత్తెల కొలువు. అక్కడ వారికే మాత్రం తీసిపోకుండా ఎంతో కాన్ఫిడెంట్‌గా ఫొటోషూట్‌ను ముగించి అందరి మన్ననలు అందుకుంది. తనలా డౌన్స్ సిండ్రోమ్‌తో బాధపడేవారికి స్ఫూర్తిగా నిలిచింది. కంప్యూటర్స్ అంటే ఇష్టపడే ఆమె ఇప్పుడు మోడలింగ్‌నే కెరీర్‌గా మలుచుకుంటోంది.

అట్టమీద కథ

# విలక్షణ విద్యలు

**మనది యువ భారత్. యువతకే చెందాల్సిన భారత్. కానీ, యువత భవిత నత్తనడక నడుస్తోంది. ఒకప్పటి గొప్ప ఇంజినీర్ ఇప్పుడు వీధికొకడు, నిన్నటి రోజున పట్టా తెచ్చుకుని కాలర్ ఎగరేసిన గ్రాడ్యుయేట్ ఇప్పుడు కూలికొకడు. ఎం.కామ్ చదివిన అమ్మాయి ఏ ప్రత్యేకత లేక కామ్ అయిపోతే, ఐటీ నేర్చినా ఆమె కెరీర్ డౌటే. అంతే లేని సమాచారాన్ని పెటా బైట్ల మేర బుర్రల్లోకి బలవంతంగా ఎక్కించేస్తున్నారు గానీ, క్రాష్ అవుతున్న సిస్టమ్‌ను పట్టించుకోవడం లేదు. పునాదుల నుంచి పెకిలించి మార్చాల్సిన విద్యావిధానంపై నిర్ణయం నానుతూనే ఉంటుంది. ఈలోగా మరిన్ని తరాలకు వార్ధక్యం వచ్చేస్తుంది. ప్రధాన స్రవంతి నుంచి వేరుపడి భవితకు కొత్తదార్లు వేస్తున్న కొన్ని చదువులకు మళ్లితే కొంతైనా పరిస్థితిలో మార్పు వస్తుంది. ఇంటర్మీడియట్ అనంతరం ఎంచుకోదగిన అలాంటి కొన్ని విలక్షణ విద్యల గురించినదే ఈ వారం అట్టమీది కథ.**

స్నేహ డెస్క్

ఉద్యోగాల వేటలో పడి శల్యమైపోతున్న యువతరం ముఖచిత్రం ప్రతి చోట కనిపిస్తోంది. పసలేని చదువులు, కాలాన్ని మింగేస్తున్న బోధన తీరుతో దశాబ్దాలకు దశాబ్దాలు వెనుకబడిపోతోంది. భవితకు దిశానిర్దేశం చేసేవారి పాత రోకటి ఆలోచన లోతుల్లోనే పడి నలిగిపోతోంది. ఇంటర్ అవుతుంది. తర్వాత ఏం చేయాలి? ఇంజినీరింగ్ పరిస్థితి బాలేదు. మెడిసిన్‌కు స్థోమత లేదు. పోనీ, ఏ డిగ్రీనో పూర్తి చేద్దామంటే చాలీచాలని జీతాలతో సరిపెట్టుకోవాలేమో. అసలు ఆ చదువుకే మంచి ఉద్యోగం దొరికే పరిస్థితి లేదు. ఇది కొందరు చదువరుల వేదన. డిగ్రీలో అవే రొటీన్ సాంప్రదాయక కోర్సులు. గణితం, భౌతిక, రసాయన శాస్త్రాలు లేదా కామర్స్, ఆర్ట్స్, లాంగ్వేజెస్. వాటిలో అంత ఆసక్తి లేదు. ఏదైనా కొత్తది చదవాలి. కొత్తగా చేయాలి. ఇది మరికొందరు ఔత్సాహికుల ఆలోచన. ఇంటర్మీడియెట్ పరీక్షల గండం గట్టెక్కామనుకోడంతో సరిపోదు. పోటీ చదువుల టిక్... టిక్...ల మధ్య వేగంగా నిర్ణయం తీసుకుని ఏదో ఒక కోర్సులో సీటు సంపాదించాలి. లేకపోతే విద్యార్థి జీవితంలో అత్యంత విలువైన కాలం వృథా అవుతుంది. దాని తాలూకా ప్రభావం ఉద్యోగ జీవితంలో పడుతుంది.

ఇప్పటి తరానికి పెద్ద అవరోధం చదువులపై తల్లిదండ్రుల తీరే. ఎవరో పక్కింటి పిల్లాడు ఇంజినీరింగ్ చదివి లక్షల్లో ఉద్యోగం కొట్టేస్తే, అది తన కొడుకు చేయాలనుకుంటారు. బంధువుల పిల్ల మెడిసిన్ సీటు సంపాదిస్తే అది తన కూతురికి సాధ్యం కావాలనే ఒత్తిడి. తెల్లారి నిద్ర లేచింది మొదలు, చదువాపి రాత్రుళ్లు పట్టని నిద్ర కోసం దిండు అదుముకున్న వరకు కెరీర్ కేకలు చెవుల్లో అరుస్తుంటాయి. కలల్లో భయపెట్టి పట్టీపట్టని నిద్రను చెరుస్తుంటాయి. ఇష్టం లేకున్నా

బలవంతంగా ఏదో ఒక పెద్ద చదువును చంకనెక్కించుకోవాలి. బుర్రను వేడెక్కించే టెక్నాలజీ చెట్టెకాల్సిందే. గొర్రెలకు మనకు తెలివితేటల్లో అంత తేడా లేనట్టు మందకు మంద ఒకే చదువుల కొండెక్కి దూకాలి. లేకపోతే చుట్టూ ఉన్నవారు నిర్దాక్షిణ్యంగా ఎంతకి తెగని చదువుల అగాథంలో తోసేస్తారు. ఇప్పటికిప్పుడు మార్పు అసాధ్యమే అయినా కొన్ని కొత్త తరహా కోర్సులు దివిటీ పట్టుకుని భవితను చేర్చే మార్గం మధ్య ఎదురుచూస్తున్నాయి. పుస్తక జ్ఞానానికి, వాస్తవ అవసరాలకు తేడాను పసిగట్టి డబ్బుతోపాటు అభిరుచిని సంతృప్తి పరిచే పని కల్పిస్తున్నాయి. పోటీ పరీక్షల్లో ఫ్లాష్‌లు, ఫ్లాష్‌లుగా కదిలిపోయే పాయింట్లే భవితకు పునాదులుగా పనికొస్తున్నాయి. నేటి ప్రపంచ అవసరాలను అర్థం చేసుకుని అవకాశాలను అందిచ్చే ప్రత్యేకమైన వృత్తి విద్యా కోర్సులు చాలానే ఉన్నాయి. వారివారి అభిరుచులకు తగ్గ కోర్సులు అనేకం ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. కేవలం ప్రత్యక్ష విద్యా బోధనతోనే కాక, ఈ లెర్నింగ్ విధానంలోను గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చేరువ అవుతున్నాయి. అటువంటి ప్రత్యేక కోర్సులు కొన్నింటి గురించి...

## తేనీటి విందు

**టీ**ని రుచి చూడటం కూడా ఓ విద్యే. రకరకాల రుచుల్ని టేస్ట్ చేస్తూ క్వాలిటీ టెస్ట్ చేయాలి. రంగు, రుచి, సువాసన, చిక్కదనంలోని తేడాల్ని పసిగడుతూ వాటి మిశ్రమాల్ని రూపొందించాలి. తమ రిపోర్ట్ల ద్వారా తేయాకు కోత దగ్గర నుంచి టీపొడిగా మార్చడం వరకు వివిధ అంశాల్లో మార్పుల్ని సూచించాలి. ఏ మిశ్రమాలు కలిపితే ఎలాంటి ఫ్లేవర్ వస్తుందో పరీక్షించాలి. ఓ సారి ప్రొఫెషనల్ టీ టేస్టర్‌గా గుర్తింపు వస్తే అనేక సంస్థలు ఉద్యోగాలు ఇచ్చేందుకు సిద్ధమవుతాయి. టీపొడి తయారీ సంస్థలతో పాటు స్టార్ హోటళ్లు, ఇతర ఆహార, విడిది కేంద్రాల్లోను అవకాశాలు లభిస్తాయి. బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యూచరిస్టిక్ స్టడీస్ దీనిలో మూడు నెలల కోర్సును అందిస్తోంది. తేయాకు తోరణమైన అస్సాంలోని వ్యవసాయ విశ్వ విద్యాలయంలో కూడా కోర్సులు ఉన్నాయి. టీ కోసమే అక్కడ ప్రత్యేకంగా టీ హజ్బెండరీ అండ్ టెక్నాలజీ శాఖ ఉంది. టీ టేస్టర్స్ అకాడమీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్ తదితర సంస్థలూ కోర్సులను అందిస్తున్నాయి.

### పప్పీల ముస్తాబు

పెంపుడు జంతువులంటే చాలా మందికి ప్రాణం. వాటి ఆరోగ్య విషయంలో కుటుంబ సభ్యులకు మల్లే శ్రద్ధ చూపుతున్నారు. వాటిని అందంగా అలంకరించడం, కొత్త విషయాలు నేర్పడం వంటివి ఇప్పుడు ఎక్కువయ్యాయి. వాటి కోసమే ప్రత్యేకంగా కాస్ట్యూమ్స్, ఆహారం, ఉపకరణాల మార్కెట్ విస్తరిస్తోంది. నగరాల్లో ఇప్పుడిది క్రేజీ కల్చర్. కన్నబిడ్డల్నే చూసుకోలేక కేర్ సెంటర్లకు అప్పజెప్పుతున్నవారికి పెంపుడు జంతువుల ఆలనాపాలన చూసే తీరిక ఎక్కడుంటుంది. వాటిని శుభ్రపరచడం, ముస్తాబు చేయడం, హెల్త్ చెకప్‌లకు తీసుకెళ్లడం పెద్ద పనే కూర్చుంది. ఇవన్నీ కుదరక చాలామంది పెట్ గ్రూమర్లను ఆశ్రయిస్తున్నారు. పెట్ గ్రూమింగ్‌పై ప్రొఫెషనల్ కోర్సులు చేసినవారిపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ పనిలో మంచి ఆర్జన ఉంటోంది. బెంగళూరుకు చెందిన ఫజ్జీవుజ్జీ పెట్ గ్రూమింగ్ స్కూల్ దీనిలో శిక్షణనిస్తోంది. చాలా నగరాల్లోను ఈ తరహా శిక్షణా సంస్థలు నెలకొన్నాయి. పార్ట్ టైమ్‌గా కూడా ఈ వృత్తిని చేసే వీలుండటంతో పెద్ద లక్ష్యాలు పెట్టుకున్నవారికి తాత్కాలికంగా ఆదాయ వనరు అవుతోంది.

### కీటకాలే కెరీర్ కోటలు...

మనిషి ఆరోగ్యాన్ని బాగా ప్రభావితం చేస్తున్నవి కీటకాలే. రకరకాల రోగాలకు అవే కారణం. వ్యాధిని వ్యాప్తి చేసే వీటిపై ఓ కన్ను వేయకపోతే చాలా పెను ప్రమాదం. కొన్ని కీటకాలేమో వ్యవసాయానికి, ఫలసాయానికి చాలా కీలకం. పురుగు మందుల వల్ల అవి నాశనం అవడంతో దిగుబడులు తగ్గుతున్నాయి. మంచివాటికి, చెడ్డవాటికి తేడా తెలుసుకోవడం నిరంతరం కొనసాగే పరిశోధనే. వాటి ఆవాసాలను, సంఖ్య, వ్యాప్తిని పరిశీలిస్తూ తగు చర్యలు తీసుకోకపోతే తీవ్ర నష్టాన్ని ఎదుర్కోవాల్సివస్తుంది. భిన్న జాతులకు చెందిన కీటకాల లక్షణాలు, ప్రమాదకర స్థాయి, నివారణ చర్యల వంటి సమాచారం ఎప్పటికప్పుడు క్రోడీకరించాల్సి ఉంటుంది. ఈ పనినే వృత్తిగా మలుచుకుంటే మంచి అవకాశాలు అంది వస్తాయి. పాండిచ్చేరి విశ్వవిద్యాలయంలోని వెక్టర్ కంట్రోల్ సెంటర్‌తోపాటు చాలా సంస్థలు దీనిపై కోర్సులను అందిస్తున్నాయి. పురుగు మందు తయారీ సంస్థలు, వివిధ వ్యవసాయ పరిశోధనా సంస్థలు వంటి

## తోలు బొమ్మల దోస్తీ

**తో**లు బొమ్మలాడిస్తూ పిల్లలకు పాఠాలు చెబితే ఇట్టే ఆకలింపు చేసుకుంటున్నారని పరిశోధకులు తేల్చారు. స్వాతంత్ర్య పోరాటం స్ఫూర్తి గాథల నుంచి పిల్లల నీతి కథలకు తోలు బొమ్మ ఆడితేనేగానీ ప్రాణం రాదు. గతమెంతో ఘనమైన తోలు బొమ్మలాట ఆ మధ్య ప్రభను కోల్పోయినా ఈ మధ్యే కొత్త మార్పుల్తో పునరుజ్జీవనం పోసుకుంటోంది. కార్పొరేట్ల స్ఫూర్తి పాఠాల నుంచి ప్రచార కార్యక్రమాలకు వీటిని చక్కగా వినియోగిం చుకుంటున్నారు. సరదాగా వినోదాత్మకంగానే కాక పెద్ద పెద్ద విషయాల్ని తేలిగ్గా తెగ్గొట్టేసేందుకు వీటిని ఉపయోగిస్తున్నారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్లలో లోతుగా ముద్రించలేని అంశాలకు పప్పెట్ షోలను ఉపయోగించడం ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది. పాత ఎప్పుడూ కొత్త ఫ్యాషనే కదా. పప్పెట్ షోల నిర్వహణ, వాటి తయారీ, కథారూపకల్పన, వాటిని ఆడించడం వంటి ఎన్నో విషయాలపై కోర్సులు అందుబాటులో ఉన్నాయి. తోలుబొమ్మలాటను పాఠ్యాంశంగా బోధిస్తోంది ముంబై విశ్వవిద్యాలయం. ప్రఖ్యాతి గాంచిన కలకత్తా పప్పెట్ థియేటర్ ఓ అకాడమీని స్థాపించే ఏర్పాట్లు చేస్తోంది.

## కొత్త కాంతులు

ఎలక్ట్రానిక్స్, ఆప్టికల్ టెక్నాలజీ మిశ్రితంగా రూపొందిందే ఫొటానిక్స్ కోర్సు. కాంతి కణాలైన ఫోటాన్స్‌కు సంబంధించిన ఎమిషన్, డిటెక్షన్, ట్రాన్స్‌మిషన్, మాడ్యులేషన్ వంటి టెక్నిక్‌లపై అవగాహన కల్పిస్తారు. రకరకాల ఎలక్ట్రానిక్ పరికరాల తయారీలో ఫొటానిక్స్‌దే కీలక పాత్ర. సంప్రదాయ కోర్సుల్ని చేసిన వారితో పోలిస్తే ఫొటా నిక్స్‌లో ప్రత్యేక కోర్సులు చేసినవారికి మంచి డిమాండ్ ఉంది. కోచిలోని ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ ఫొటాన్స్, యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఐఐటీ చెన్నై, న్యూఢిల్లీతో పాటు పిలానిలోని సీరీ తదితర సంస్థలు కోర్సులను అందిస్తున్నాయి.

వాటిలో మంచి భవిష్యత్తు ఉంటుంది.

**రుచిని జోడించి...**

మంచి రుచిని, సువాసనను ఆహారానికి జోడించేందుకు ఫుడ్ ఫ్లేవరిస్టులు లేదా ఫ్లేవర్ కెమిస్ట్‌ల అవసరం ఉంది. వివిధ రకాల ఆహార పదార్థాలకు ప్రత్యేక రుచిని, రంగును, సువాసనను తీసుకు రావడమే వీరి పని. దీనికి రసాయన

శాస్త్రాన్ని చక్కగా వినియోగించుకుంటారు. వివిధ రకాల రసాయనాలు, వృక్ష సంబంధిత పదార్థాలు, నూనెలు తదితరాల ప్రభావంపై అవగాహన కల్పిస్తారు. ఫ్లేవరిస్ట్‌గా కోర్సు చేసినవారికి వివిధ ఆహార తయారీ సంస్థల్లో ఉద్యోగాలు వస్తాయి. టూత్‌పేస్టులు, బేవరేజీలు, కాస్మొటిక్స్ రంగాల్లోను అవకాశాలున్నాయి. ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ అండ్ మేనేజ్‌మెంట్, సెంట్రల్ ఫుడ్ టెక్నోలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, మైసూరుతో పాటు కొన్ని సంస్థలు కోర్సులను అందిస్తున్నాయి.

**మ్యూజియాలజీతో ఈజీ...**

మ్యూజియంలోని వస్తువుల కేటలాగింగ్, మ్యూజియం నిర్వహణ ఓ గొప్ప విద్య. పురాతత్త్వం, చరిత్ర, సంస్కృతి వంటి విషయాలపై ఆసక్తి ఉన్నవారికి మ్యూజియాలజీ కోర్సు మంచి అవకాశాల్ని కల్పిస్తుంది. కొత్త విషయాలను తెలుసుకోవాలనే తపన ఉన్నవారికి, చరిత్ర పరిశోధనపై మక్కువ ఉన్నవారికి ఈ కోర్సు సరిగ్గా కుదురుతుంది. మ్యూజియాలజీలో అనేక రకాల కోర్సులున్నాయి. స్వల్పకాలిక, దీర్ఘకాలిక కోర్సుల్లో ఏవి నప్పితే అవి చేసే వీలుంది. వివిధ మ్యూజియాలు, వస్తు సేకరణ సంస్థలు, పాన్, వేలం కేంద్రాల్లో అవకాశాలు అందిపుచ్చుకోవచ్చు. న్యూఢిల్లీలోని నేషనల్ మ్యూజియమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిస్టరీ అండ్ ఆర్ట్, కన్జర్వేషన్ అండ్ మ్యూజియాలజీ వివిధ కోర్సులను అందిస్తోంది. కలకత్తా విశ్వవిద్యాలయం కూడా కోర్సుల్ని అందిస్తోంది.

**భవితకు కార్పెట్**

కార్పెట్ల తయారీలో భారత్‌ది ప్రత్యేక స్థానం. కాశ్మీర్, జైపూర్ తదితర ప్రాంతాల పేర్లతోనే బాగా గుర్తింపు పొందాయి. దేశవాళీ కళ, నైపుణ్యంతో ఆకర్షణీయంగా, వివిధ రూపాల్లో చేసిన కార్పెట్లకు అంతర్జాతీయ స్థాయిలో మంచి మార్కెట్ ఉంది. వీటి తయారీ, రూపకల్పన తదితర అంశాల్లో కోర్సు చేసినవారికి మంచి అవకాశాలున్నాయి. ఉత్తరప్రదేశ్ భదోహిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్పెట్ టెక్నాలజీ వివిధ డిప్లొమా కోర్సులను అందిస్తోంది. ఆసియాలోని అత్యుత్తమ సంస్థల్లో ఒకటైన దీనిలో కోర్సు పూర్తిచేసినవారికి మంచి అవకాశాలు వస్తున్నాయి. శ్రీనగర్‌లోని సంస్థలోనూ కోర్సుల్ని ఎంపిక చేసుకోవచ్చు.

**స్పాలో సేద...**

ఎన్నో ఒత్తిళ్లను విసిరికొడుతూ స్పాలు సేదతీరుస్తాయి. అవే స్పాలు మంచి అవకాశాలను కల్పిస్తూ కెరీర్ ఒత్తిడినీ తగ్గిస్తున్నాయి. ఇటీవల పెరిగిపోయిన ఈ సంస్కృతి చాలా అవకాశాలను అందిస్తోంది. స్పా నిర్వహణతో పాటు, రకరకాల చికిత్స ప్రొఫెషనల్స్‌కు చాలా డిమాండ్ కనిపిస్తోంది. ఒకప్పుడు థాయ్‌లాండ్, బ్యాంకాక్‌కో, లేదా కేరళకో వెళ్లాల్సిన పరిస్థితి లేదు. ఎక్కడికక్కడే విభిన్న రీతుల స్పాలు చాలా చోట్ల అందుబాటులోకి వచ్చేశాయి. దీన్ని ఓ వృత్తిగా చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నాయి కొన్ని సంస్థలు. వీలుంటే కోర్సు నేర్చుకునే సమయంలోనే సంపాదించుకోవచ్చు కూడా. హైదరాబాద్‌లోని ఆనంద స్పా ఇన్‌స్టిట్యూట్ డిప్లొమాను అందిస్తోంది. జైపూర్‌లోని ఓరియెంట్ స్పా అకాడమీ అందించే ఆయుర్వేదిక్ స్పా థెరపీ డిప్లొమా, ఆయుర్వేద ఫౌండేషన్ ప్రోగ్రామ్ లేదా ఇతర సర్టిఫికెట్ కోర్సులను ఎంపిక చేసుకోవచ్చు. ముంబై, ఢిల్లీ, మంగళూరు లాంటి నగరాల్లోను ఈ కోర్సుల్ని అందిస్తున్న సంస్థలున్నాయి. కేరళ అన్నా బెల్ స్పా ఇన్‌స్టిట్యూట్ అయితే కోర్సుకు ఎంపికైనవారికి ఉచితంగా శిక్షణనిస్తోంది.

**ఏవీలో ఎన్నో**

మీడియాకు విపరీతమైన మార్కెట్ ఉన్న ఈ రోజుల్లో దానికి కీలకమైన ఆడియో విజువల్ కోర్సులు పూర్తి చేసినవారికి ఉద్యోగ అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఎఫ్‌ఎంలు,

పెస్ట్ కంట్రోల్

స్పా

మ్యూజియాలజీ


పెట్ గ్రూమింగ్

## పరభాషతో కొలువు

భారత విదేశాంగ విధానం విస్తృతమైన దరిమిలా అనేక దేశాలకు చెందిన సంస్థలతో వాణిజ్యం పెరిగింది. అనేక బహుళజాతి సంస్థలు ఇక్కడి యువత నైపుణ్యాన్ని ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నాయి. కానీ, భాషే అడ్డుగా నిలుస్తోంది. అన్ని చోట్ల ఇంగ్లీష్ పనికి రావడం లేదు. ఇంగ్లీష్‌తో సమానంగా వ్యాప్తి చెందిన భాషల్ని నేర్చుకోగలిగితే ఆ అంతరాన్ని తేలిగ్గా పూడ్చవచ్చు. అవకాశాల్ని చేజిక్కించుకోవచ్చు. పరదేశాల సంస్థల్ని చక్కగా నిర్వహించేందుకు భాషా జ్ఞానం తప్పని సరౌతోంది. బీపీవోలు, కాల్‌సెంటర్లకు భాష నైపుణ్యమే కీలకమౌతోంది. ఈ తరుణంలో విదేశీ భాషల్లో మంచి పట్టు సాధిస్తే మంచి అవకాశాలు వస్తున్నాయి. ఇంగ్లీషేకాక జపనీస్, రష్యన్, స్పానిష్, కొరియన్, జర్మన్, ఫ్రెంచ్, లాటిన్, ఇటాలియన్, మాండరిన్ వంటి విదేశీ భాషల్ని నేర్చుకున్నవారికి కేవలం అనువాదకులుగానే మంచి అవకాశాలు దొరుకుతున్నాయి. మెడికల్ ట్రాన్స్క్రిప్షన్ ప్రధానంగా ఇంగ్లీష్‌లోనే జరుగుతున్నా సమీప భవిష్యత్తులో ఇతర భాషల దేశాలకు విస్తరించొచ్చు. ఇవే కాక వివిధ లాబీయింగ్‌లు, పర్యాటకం తదితర రంగాల కోసం రక రకాల అవకాశాలు పుట్టుకొస్తున్నాయి. మన హైదరాబాద్‌లోని సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ అండ్ ఫారెన్ లాంగ్వేజేస్‌తో పాటు న్యూఢిల్లీలోని అనేక విద్యాసంస్థలు కోర్సుల్ని అందిస్తున్నాయి.

టెలివిజన్, డిజిటల్ మీడియా అభివృద్ధి తారాస్థాయికి చేరుకోవడంతో ఆడియోవిజువల్ టెక్నీషియన్లకు మంచి డిమాండ్ ఉంటోంది. జర్నలిజం, ఫిల్మ్ మేకింగ్, మీడియా ప్రమోషన్, బ్రాండ్ ప్రమోషన్, ఫొటోగ్రఫీ, మీడియా స్టడీస్ ఇలా ఎన్నో రంగాల్లో ఏవీకి మంచి స్కోప్ ఉంది. వాటిల్లోను రకరకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయి. పూణెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియాతో పాటు ఎన్నో సంస్థలు వీటిల్లో పలు రకాల కోర్సులను అందిస్తున్నాయి. ప్రఖ్యాత టెలివిజన్ సంస్థలతో పాటు ప్రొడక్షన్ హౌసెస్ కూడా కోర్సుల్ని అందిస్తున్నాయి.

వీటితో పాటు మాస్ కమ్యూనికేషన్, ఫ్యాషన్ డిజైనింగ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, హోటల్ మేనేజ్‌మెంట్, యాక్టింగ్, డ్యాన్స్, బ్యూటీ షియన్, ఎంట్రిప్రెన్యూనర్‌షిప్ వంటి భిన్న రంగాలకు చెందిన అనేక కోర్సుల్ని వివిధ సంస్థలు అందిస్తున్నాయి. వీటి ద్వారా విభిన్న తరహా కెరీర్లను రూపొందించుకునే అవకాశం కలుగుతోంది. రూరల్ స్టడీస్, హాస్పిటాలిటీ సైన్స్, డ్రామాటిక్స్, టెక్స్‌టైల్ డిజైన్, యోగిక్ సైన్స్, ఈ కామర్స్, ట్రావెల్ అండ్ టూరిజం, జర్నలిజం, సోషల్ వర్క్, ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ వంటి భిన్న వృత్తుల్లో ఉజ్వల భవిష్యత్తు ఉంటోంది. తమ అభిరుచికి, ఆసక్తికి, నైపుణ్యానికి తగిన కోర్సును ఎంపిక చేసుకుని ముందడుగు వేస్తే ట్రాఫిక్ తగ్గి కెరీర్ ప్రయాణం సులువవుతుంది. అయితే, ఇంజినీరింగ్, ఎంబీయేల వేలంవెర్రి వల్ల దెబ్బతిన్నట్టుగానే ఒకే కోర్సుపై పడితే అవే పరిస్థితులు ఎదురవుతాయి. ఇక్కడ డిమాండ్ సప్లై రూల్‌ను కూడా కాస్త జాగ్రత్తగా గుర్తుంచుకోవాలి. మంది ఎక్కువైతే మజ్జిగ పల్చనౌతుందన్న సామెత ఉండనే ఉంది. కోర్సు, విద్యాసంస్థ, ఉద్యోగావకాశాల తీరును జాగ్రత్తగా పరిశీలించి గమ్యాన్ని ఎంపిక చేసుకోవాలి. ఎక్కడైనా కృషి, శ్రమ, పట్టుదలతోనే విజయం సాధ్యం. మార్పుల్ని గమనిస్తూ ఎప్పటికప్పుడు కొత్త నైపుణ్యాలను పెంచుకుంటే మంచి భవిత తేలికే అవుతుంది. ఇవే కాక మరెన్నో అవకాశాల్ని అందించే కోర్సులున్నాయి. ఇప్పుడు బాగా అందుబాటులో ఉన్న ఇంటర్‌నెట్‌ను సరిగ్గా శోధిస్తే మంచి భవిష్యత్తును అందించే తావు పట్టుకోవచ్చు. మన భవిత మన చేతుల్లోనే ఉంది. ఏమి క్లిక్ చేస్తారో. దేన్ని లైక్ చేసి హిట్ కొడతారో.

✦

# పోలీసు గుర్రం

పుప్పాల కృష్ణమూర్తి
-9912359345

మూసీ నది ఒడ్డునున్న దట్టమైన తాటి వనంలో తొమ్మిది మంది సభ్యులున్న గెరిల్లా దళం విశ్రాంతి తీసుకుంటోంది. దళ కమాండర్ హరినారాయణ బ్రాహ్మడు. నిజాం మీద జరుగుతున్న పోరాటానికి ఆకర్షితుడై మిల్ట్రీ నుంచి వచ్చి, దళ సభ్యులకు గెరిల్లా శిక్షణ ఇస్తున్నాడు.

చాకలోళ్ల సాయన్న, తురకోళ్ల హుసేను, ఒడ్డెరోళ్ల పిచ్చయ్య, కంసలోళ్ల రామబ్రహ్మం, కోంటోళ్ల శేషయ్య, అనిరెడ్డి చంద్రారెడ్డి, మాలోళ్ల మోష, వివిధ కులాల వాళ్లు, మతాల వాళ్లు ఉన్నారు.

వారినందరినీ ఒకటి చేసి దండు కట్టించింది కమ్యూనిస్టు పార్టీ డిప్యూటీ దళ కమాండర్ తెలగోళ్ల వెంకటాద్రి సెంట్రీ డ్యూటీ చేస్తున్నాడు.

వెన్నెల సన్నగా కాస్తోంది. బలుసు పొదలు, మంగ పొదలు, జిట్ట రేగు పొదల నుండి వచ్చే సన్నటి పరిమళం ఆ ప్రాంతాన్నంతా సుగంధభరితం చేస్తోంది. కానీ ఆ సౌందర్యాన్ని ఆస్వాదించే స్థితిలో లేడు వెంకటాద్రి. రజాకార్ల అకృత్యాలకు అతని గుండె భగభగ మండిపోతోంది. ఒకటా, రెండా? ఎన్నని ....? ఐనా, ప్రజల అండతో రజాకార్లను ముప్పు తిప్పలు పెట్టి, పోరాటాన్ని ముందుకు తీసుకుపోతున్నారు. ఉరుములేని పిడుగులా కొత్తగా వచ్చి పడ్డది అశ్విక దళం. గుర్రాలు ఎనుబోతంత ఉన్నాయి. గుల్బర్గా నుంచి వచ్చాయట. హైద్రాబాదులో వీటికి ప్రత్యేకంగా పెద్ద పెద్ద శాలలే ఉన్నాయట. నైజాం నవాబు కమ్యూనిస్టుల్ని అణిచి వేయడానికి ప్రత్యేకంగా పంపాడు. కమ్యూనిస్టు కనబడితే వదిలి పెట్టడం లేదు. ఎంత జనంలో ఉన్నా ఇట్టే గుర్తు పట్టి వెంటబడుతున్నాయి. ఇప్పటికే అశ్విక దాడిలో పసునూరు వెంకటరెడ్డి చనిపోయారు. కాలేజీ చదువుల్ని వదిలేసి పోరాటంలోకి వచ్చినవాడు. వెన్నెలంత చల్లనోడు. గ్రామంలో ఉండగా సిఐడిల సమాచారంతో హఠాత్తుగా దాడిచేసి చంపింది. హరినారాయణ దళం గ్రామంలోకి పగలే వెళ్లింది. ప్రజలంతా ఆత్మ బంధువును చూసి మూగినట్టు చుట్టూ చేరారు.

"మీరు లెవీ కట్టకండి. ఈ నిజామోడి తాబేదార్లయిన జమీందార్లని, పట్వారీలని ఊళ్ళె నుంచి వెళ్లగొట్టాలె. మన గ్రామంలో మన పరిపాలనే ఉండాలె. దున్నే వాడికే భూమి దక్కాలె. అందరికీ భూమి కోసమే ఈ పోరాటం. భూముంటే బువ్వుంటుంది. బట్టుంటది. మనం మంచిగ బతుకుతాం... ముఖ్యంగా శత్రువుకు మన సమాచారం ఇచ్చే వాళ్లని కనిపెట్టి ఉండండి." దళ కమాండర్ ప్రజలకు వివరిస్తున్నాడు.

ఇంతలో ఉరుము లేని పిడుగులా వచ్చి పడ్డాయి.. పన్నెండు గుర్రాలు. ఊళ్లో నుంచి మోత్కూరుకు పోవడానికి తూర్పు వైపు నుంచే వెళ తుంటారు సామాన్యంగా. అటు నుంచే పోలీసు రావచ్చని సెంట్రీని పెట్టారు. దాన్ని అంచనా వేసి, గ్రామాల మీదుగా దాటి, పడమర వైపు నుంచి వచ్చారు. వంద గజాల దూరంలో గుర్రాలు కనబడే సరికి "గ్రామాల మీదుగా దాడి, పారిపోండి." మొదట చూసిన వ్యక్తి గట్టిగా అరిచాడు. గద్ద కనబడితే కోడి పిల్లలు కకావికలం అయినట్లు జనమంతా తలో దిక్కు పరిగెత్తారు. ఆ సమయంలో పొజిషన్ తీసుకోవడం కూడా సరైనది కాదని దళం కూడా పరిగెత్తింది. రజాకార్లు జనాన్ని బెత్తంతో బాదుతూ, తుపాకి మడమతో గుద్దుతూ వెంటబడ్డారు. బలం కొద్దీ జనంలో పడి పరిగెత్తుతున్నారు. సంకనున్న తుపాకిని చూసి, చోటేమియా గాని గుర్రం వెంకటాద్రి వెంటబడ్డది. దాని గురించి జనం కతలు కతలుగా చెప్పుకోసాగారు. అది మేలు జాతిదని, చోటేమియా రిజ్వీనడిగి ప్రత్యేకంగా తెచ్చుకున్నాడని, అది వెంటబడితే యమినోడు వెంటబడ్డట్లేనని, అది కాళ్లతోటే మనిషిని తొక్కి చంపుద్దని.. జనంలో ప్రచారం జరిగింది. అది రజాకార్లకు అవసరం కూడ. అశ్విక దళం గురించి నాయకులు చెప్పింది గెరిల్లాకు జ్ఞాపకముంది. గుర్రాలంటే భయపడొద్దు. అట్లాగని తక్కువ అంచనా వేయొద్దు. వాడి దగ్గర తుపాకి ఉంటది. దూరం నుంచి కాలు స్తాడు. గుర్రం పరిగెత్తు తుంటది కాబట్టి, గురికుదర కపోవచ్చు. కానీ దగ్గరలో వుంటే తల్వార్ విసురుతాడు. అది మరీ ప్రమాదం కత్తికి అందనంత దూర ంలో పరిగెత్తాలి. బారుగా ఎక్కువ దూరం పరిగెత్తొద్దు.



ఎందుకంటె గుర్రంతో సమానంగా మనిషి పరుగెత్తాలి. వంకర టింకరగా ఉరకాలె.. అక్షరాలా సూచనలు పాటిస్తూ ఉరుకుతున్నాడు. అయినా వదిలిపెట్టకుండా వెంటపడ్డది. వేగంగా మోదుగు పొదలు దాటి పరిగెత్తుతున్నాడు. గుర్రం ఊపిరి వెంకటాద్రి మెడ మీద వెచ్చగా తగులుతోంది. గభాల్ని కిందకు వంగి, పక్కకు పరిగెత్తాడు. అదే వడి మీద గుర్రం ఇరవై గజాలు ముందుకు పరిగెత్తింది. గుర్రాన్ని మలుపుకుని వచ్చే సరికి, తుపాకిని గుబురుగా ఉన్న మోదుగు పొదలో వదిలేశాడు. చాటు నుంచి బావిలోకి దిగి, మోట దార్ల కింద పెరిగిన రాగి చెట్టు చాటున నక్కాడు. రజాకారు పొదల్ని తుపాకితో కెలుకుతూ దిగి, డేగ కళ్లతో చూడసాగాడు. కానీ గెరిల్లా కనబడలేదు. బావికి అడ్డంగా వెళ్లడానికి వీల్లేకుండా ముళ్లకంపలున్నాయి. ఇక కనిపించడని ఆశ వదులుకుని గుర్రాన్ని వెనక్కు మలిచాడు.

వెంకటాద్రి మెల్లగా వెలుపలకు వచ్చి, గుబురుగా వున్న మర్రి చెట్టెక్కి, దాని తొర్రలో కూర్చుని చూడసాగాడు. రజాకార్లు జనాన్ని పశువుల్ని మందగా జేసినట్లు, బెత్తంతో బాదుతూ ఒక్క చోటికి గుంపు చేస్తున్నారు. జనంలో బడి పరిగెత్తి , కనబడకుండా ఉండేందుకు జొన్న చొప్ప వామి కింద దూరాడు.. పాపిరెడ్డి. ఆ దృశ్యం గుర్రం కంట్లో పడ్డది. అది నేరుగా వామి దగ్గరకు పరిగెత్తి గట్టిగా సకిలించింది. గుర్రం భాష తెలిసిన చోటేమియా, తుపాకి చేతిలోకి తీసుకుని కిందకు దూకాడు. చొప్పకు చెదలు ఎక్కకుండా మూరెడు ఎత్తున రాళ్లతో నెట్టు కట్టి ఉంది. దళంలో పనిచేసే పాపిరెడ్డి, తల్లిని చూసి పోదామని వచ్చా డు. సిఐడి సమాచారంతో వచ్చిపడ్డారు రజాకార్లు. తుపాకి తీసి ఊపుతూ "బాహర్ ఆవో సాలే. నైతో గోలీ మార్ దూంగా." బెదిరించాడు తుపాకితో. తప్పదని పాపిరెడ్డి పొక్కుంటూ మెల్లగా వెలుపలకు వచ్చాడు. కమ్యూనిస్టులకు అన్నం పెడుతున్నారని, ఊళ్లోకి వస్తే కలిసి తిరుగుతున్నారని ఐదుగురిని వేరు చేశారు. వాళ్ల కాళ్లు, చేతులు తాళ్లతో గట్టిగా కట్టేశారు. పాపిరెడ్డి కమ్యూనిస్టు గెరిల్లా అని తెలవగానే, తుపాకి మడమతో వీపున ఒక్క గుద్దు గుద్దాడు చోటేమియా. కింద పడ్డవాణ్ని, బూటు కాలుతో తొక్కిపట్టి, రెక్కలు వెనక్కు విరిచి కట్టాడు. కాళ్లు కదలకుండా కట్టాడు. మరో పోలీసు రాగానే ఇద్దరు చెరో వైపు పట్టి అమాంతం చొప్ప వామి మీదకు విసిరేశారు. అప్పటికే బందీలుగా వున్న ఐదుగుర్ని కూడా దాని మీదకు విసిరేశారు. తల్లీ పిల్లలు, జనం గుండెలు బాదుకుంటున్నా, కాళ్లు పట్టుకున్నా కనికరించలేదు. చొప్ప వామికి నిప్పంటించి, చచ్చారనుకున్న తర్వాత కొంత మంది యువకుల్ని కొట్టుకుంటూ స్టేషన్ వైపు నడిపించారు. సహచరులు సజీవ దహనం అవుతుంటే ఏమీ చేయలేక చెట్టు మీదే పొగిలి పొగిలి ఏడ్చాడు వెంకటాద్రి. తనీ రోజు గుర్రానికి దొరికి వుంటే.....? ఆ పైన ఆలోచించలేకపోయాడు. ఎలాగైనా ఆ గుర్రం అంతు చూడాలి. సిఐడిల సంగతి తేల్చాలి. మనసులో ప్రతిజ్ఞ చేసుకున్నాడు. ఆ అవకాశం దళ కమాండర్ ప్రయాణ రూపంలో రానే వచ్చింది. "బిడ్డకు సంబంధం వచ్చిందంట. వెళ్లి వెంటనే వస్తా. దళం బాధ్యత నీదే..." అని రివాల్వర్ చేతిలో పెట్టి, ఆయుధం జాగ్రత్త అని ఆ రాత్రే ఇంటికి బయలు దేరాడు.

దళం బాధ్యతలు తీసుకోగానే, తర్వాతి సీనియర్ అయిన శేషయ్యకు బాధ్యతలు అప్పజెప్పి బయలు దేరాడు. చావిట్లో నిలబడే నిద్రపోతున్నాయి గుర్రాలు. పగలల్లా జనాన్ని హింసించిన పోలీసులు, గొల్లోళ్ల దగ్గర ఎత్తుకొచ్చిన రెండు యాటల్ని కోసుకు తిని, గౌండ్లోళ్ల దగ్గర కల్లుబిర్రుగ దాగి గురకలు బెట్టి నిద్రపోతున్నారు. పదహారు గుర్రాలు వరుసగా కట్టేసి వున్నాయి. పోలీసుల్లాగే బలిసి దృఢంగా వున్నాయి. చివరన వుంది...

చోటేమియా ముద్దుగా పిలుచుకునే కాలాషేర్. దాని తోక చీకట్లో తెల్లగా మెరుస్తోంది. వెళితే కొత్త మనిషిని చూసి అలికిడి చేస్తాయి. ఒక్క క్షణం ఆలోచించి, పక్కనే ఉన్న గుడిసెలో నిద్రపోతున్న నపరోడి దగ్గరకు వెళ్లాడు. గుర్రాల్ని కడగడం, మాలిషు చేయడం, వాటికి దాణా పెట్టడం వాడి పని. మెల్లగా లేపాడు. కళ్లు తెరిచి చూసిన తిరపయ్యకు మృత్యువు ముందల నిలబడ్డట్లు నిపించింది. గడగడా వణుకుతూ "పోలీసులు ఠాణాల ఉన్నారు. నన్ను సంపకండి, నేను మీ జోలికి రాలే." అని చేతులు జోడించాడు.

"నిన్ను చంపను కానీ, నాకు చోటేమియా గాడెక్కే ఆ తెల్లతోక నల్ల గుర్రాన్ని తెచ్చిపెట్టు" అన్నాడు.

"తెలిస్తే నన్ను సంపుతరయ్యా..." అన్నాడు భయపడుతూనే.

"అందరం సచ్చెటోల్లమే. మంది కోసమే మేము హత్యార్ బట్టింది. మేము జనం కోసం జస్తుంటే, మీరు రజాకార్లకు రజాయి కప్పుతారా? తేకుంటే నా చేతిలో ఆయుధముంది చూసినవు గద?" అన్నాడు బెదిరింపుగా.

"పట్టకొస్తనయ్యా. తెంపుకు పోయిందని చెప్తాలే. జీతం లేదు, నాతం లేదు.



కొడుకులు సంపక తింటున్నారు. కాళ్లు పట్టాలె. ఒళ్లనొక్కాలె. తిన్నయన్ని సాపు జెయ్యాలె. సస్తున్న సాకిరి జెయ్యలేక. ఒక్కోడి కాడ కంపు వాసన." అని గొణుక్కుంటూ లేచాడు.. యాభయ్యేళ్లున్న తిరుపయ్య. వెంకటాద్రి చావడి వెలుపలకు వచ్చి మసక చీకట్లో దూరంగా నిలబడ్డాడు. గుర్రం తాడు విప్పి, గోడకు తగిలించిన జీను గుర్రం మీద సర్ది, కళ్లాన్ని తెచ్చి చేతికిచ్చాడు.వెనక్కు ముందుకు ఒకసారి చూచి, అమాంతం గుర్రం ఎక్కాడు. తన యజమాని కాకపోవడంతో ముందుకు కదలకుండా మొరాయించింది. నాలుగేళ్ల కింద కిషన్ రావు దొరకాడ షేర్‌దారుగా పనిచేసినప్పుడు వాళ్ల గుర్రాల మీద సవారి చేసిన అనుభవముంది. వెంటనే దాని డొక్కలో కాలి మడమతో ఒక్క తన్ను తన్నాడు. దాంతో ముందుకు దూకింది.

గుర్రాన్ని సవారీ చేస్తూ నేరుగా వెల్మజాల షావుకారు మల్లయ్య ఇంటి ముందుకు తీసుకుపోయి నిలిపాడు. జిలుగు జిలుగు వెన్నెల రాలుతోంది. మనిషి పూర్తిగా కనబడకుండా వేపచెట్టు నీడలో వున్నాడు. గుర్రం తల మాత్రం వెలుతురులో కనబడుతుంది. అరుగు మీద నిద్రపోతున్న జీతగాడ్ని లేపాడు. వాడు పరిగెత్తుకుంటూ వెళ్లి మల్లయ్యను లేపాడు. పోలీసు వచ్చాడని ఊడే పంచను సర్దుకుంటూ ఈ వేళప్పుడు వచ్చింరేంది బాంచెన్... అని అడిగాడు వినయంగా.

"కమ్యూనిష్టు ...కొడుకులు రేత్తిరే గదరా తిరిగేది. వాళ్లను పట్టుకోవాలంటే రేత్తిరే రావాలె. ఊళ్లకు ఇయ్యాల ఎవరన్నా వచ్చింద్రా?". ముఖం కనబడకుండా మీద వేసుకున్న గొంగడి చాటు నుంచి "రాలేదు బాంచన్. వస్తే కబురు చేస్త గదా. పాపిరెడ్డి వచ్చింది, దళం వచ్చేది ముందే చెప్పినగా బాంచెన్." వినయంగా వంగి సమాధానం చెప్పాడు.

"నువ్వు ఒక్కడివి జాస్తవు? మిగతా వాళ్లు సరిగ్గా సిఐడి చేస్తున్నారా?"

"చేస్తున్నారు బాంచెన్. పూసల రంగయ్య, తురకోళ్ల మోదిన్, వడ్డెర సాయిలు మంచిగ పని జేస్తున్నారు. ఆ కమ్యూనిస్టు కొడుకులు నా వడ్డీ కాగితాలు తగలబెట్టింరు బాంచెన్. భీమిరెడ్డి గాడ్ని ముందు సంపాలె. వాడ్ని జూసి జనం తెగ రెచ్చిపోతుంరు బాంచెన్".

"సంపడానికే గదరా మేం తిరిగేది. అట్టనే మందిల ఉండి ఎంక్వైరీలు దీయండి. మీకు రిజ్వీ తోటి పెద్ద ఇనాం ఇప్పిస్తా. కొడుకులు వచ్చేది ఎప్పటికప్పుడు జెప్పాలి. వాళ్లని సావనూకాలె."

"అట్లాగే బాంచెన్..." సంతోషంతో అని, వినయంగా వంగి అలాగే ఉన్నాడు.

గుర్రాన్ని వెనక్కు తిప్పాడు. మనసులోనే వాళ్ల పేర్లు నమోదు చేసుకుని కాస్త దూరం వెళ్లగానే జేబులో వున్న చిన్న పుస్తకంలో రాసుకున్నాడు. అదే రాత్రి గుర్రం మీద రేపాక, ఎర్రబెల్లి వెళ్లి, అంతకు ముందు ప్రజలు అందించిన సమాచారం ప్రకారం సిఐడిలను కలిశాడు. కమ్యూనిస్టుల్ని తిట్టుకుంటూ, నల్లగుర్రం మీద నుంచే సమాచారం సేకరించాడు. అందరి పేర్లు పుస్తకంలో రాసుకుని తెల్లవారే సరికి దళాన్ని చేరుకున్నాడు.

"అరే ఇది చోటేమియా గాడి గుర్రం గదన్నా. కళ్లెం వదులు దీన్ని చంపేస్తా. చాల మందిర్ని సంపిందన్నా." ఇస్తారి గన్నునీశాడు, పళ్లు నూరుతూ.

"ఇంకొంత పనుంది దీనితోటి. పనైనాక ఇస్తాలే." అని జరిగిన సంగతంతా చెప్పి, మూడు ఊళ్లల్ల పోలీసులకు సమాచారం అందించే వాళ్ల పేర్లు చదివాడు.

"అమ్మా ఈ ... కొడుకులు మనం బోంగనే, జై గొట్టుకుంట మనెంబటే తిరుగుతరన్నా. వట్టి ఎల్లాబి... కొడుకులు. వాడి డబ్బుకు ఆశపడి సిఐడి జేస్తున్నారు. కొడుకుల్ని బతకనీయెద్దు." బ్రహ్మం ఆవేశంగా అన్నాడు.

"వీళ్లు చోటేమియా గాడ్ని కలిసే లోపే పట్టుకోవాలె. వాడి గుర్రాన్ని గెరిల్లాలు దొబ్బుకుబోయింరని చెబితే భయపడి తప్పించుకుపోతారు." అన్నాడు హుసేను.

"అన్న జెప్పింది నిజమే. మనకో మంచి వార్త. ఆ చోటేమియా గాడు నాలుగు రోజులు హైద్రాబాదు పోతున్నడంట రజ్వీని కలవడానికి. రోజుకో ఊరుబొయ్యి కొడుకుల సంగతి చూద్దాం." అన్నాడు.

"లేదు, లేదు. ఒకే రోజు మూడు ఊళ్లల్లో సిఐడిలను పట్టుకోవాలె. ఒక ఊళ్లె పట్టుకున్నమని వార్త తెలవంగనే, తప్పించుకపోతారు. కాబట్టి ముగ్గురు చొప్పున ఒక్కో ఊరు వాళ్లను పట్టుకుందాం. నేను వెల్మజాల వెళతాను ఎందుకంటే జనం భయం మీదున్నారు. వాళ్లకు ధైర్యం చెప్పాలె." అన్నాడు.

మిగతా ఇద్దర్ని వెంటబెట్టుకుని వెల్మజాల వెళ్లాడు. చోటేమియా గాడి గుర్రాన్ని జూసిన జనం పారిపోసాగారు. జేబులోంచి ఎర్ర జెండా తీసి గాలిలో ఊపాడు. అది పీడితులకు రక్షణ నిచ్చే గొడుగని, అణచివేయబడే జనానికి వేగు చుక్కని తెలుసు. అందుకే, వాన పడితే ఉసిళ్లు బైటికొచ్చినట్లు, ఊరంతా వాళ్ల దగ్గరికి వచ్చి చేరింది. చోటేమియా గాడ్ని, వాడి గుర్రాన్ని తిట్టసాగారు. "ఎట్ల దెచ్చినవు ...గాడి గుర్రాన్ని?" అని గుచ్చి గుచ్చి అడగసాగారు.

"గా ముచ్చట తర్వాత చెబుతగాని, కోంటోళ్ల మల్లయ్యను, పూసల రంగయ్యను, తురకోళ్ల మోదిన్‌ను, వడ్డెర సాయిగాడ్ని గుంజక రాపోండి. కొడుకులు సిఐడి జేస్తుంరు." అన్నాడు.. వెంకటాద్రి. "కొడుకులు అంత పని జేస్తున్నారా? బతకనీయొద్దు. సక్కదనాల పాపిరెడ్డిని, రాంరెడ్డిని పొట్టన బెట్టుకున్నరా." అంటూ పరిగెత్తుకు వెళ్లి ఇండ్ల మీద పడ్డారు. తలకు వున్న కండువాను శత్రువు మెళ్లో వేసి, కచ్చేరి వద్దకు లాక్కొచ్చారు. కాస్త చదువుకున్న మల్లయ్య వచ్చినోళ్లని మాటల్తో అదరగొట్టాడు. కానీ చోటేమియా గాడి గుర్రాన్ని దళం దగ్గర చూసే సరికి నక్కిళ్లు పడ్డాయి. తప్పయిందని కాళ్లా, వేళ్లా పడ్డాడు. అప్పుడు దళ కమాండర్ రాత్రి జరిగిన సంగతంతా జనానికి వివరించాడు.

"ఈ దుర్మార్గుల్ని అస్సలు వదలొద్దన్నా. వీళ్లను క్షమిస్తే పామును వదిలి పెట్టినట్లే. మళ్లీ సిఐడి జేసి జనాన్ని సంపిస్తరు." జనం కేకలు వేయసాగారు.

"సోచాయించకండి బిడ్డలారా. నా కొడుకు చూసిపోదామని వస్తే, ఆ రజాకారు నా బట్టకు జెప్పి, సంపించింద్రు. నా కొడుకు నిలువున మంటల్లో కాలిపోయిండు." గుండెలు బాదుకుంటూ ఏడ్వసాగింది తల్లి. తర్వాత తేరుకుని మీకు పాపమనిపిస్తే, ఆ అత్యారిటియ్యంద్రి. నిలువున గాలుస్త. ఆటెంక అమీనోడొచ్చి సంపినా సస్త." డెబ్బయ్యేళ్ల ఆదెమ్మ శిగం వచ్చిన దానిలా ఊగిపోతోంది.

గెరిల్లా తుపాకి ఎక్కు పెట్టాడు. సిఐడిలు జనం నుంచి దూరమైపోయారు.

ఎర్రబెల్లి రాపాకల్లో గూడా ప్రజలు, సిఐడిలు చేసే వాళ్ల పేరు చెప్పగానే పట్టి లాక్కొచ్చారు. కమ్యూనిస్టులొచ్చారని తెలిసి, గడ్డివాముల్లో, గాదెల్లో, మసెల మీద దాక్కున్న ద్రోహుల్ని గాలించి మరీ గుంజుకొచ్చి బజాట్లో కూలేశారు. జరిగనదంతా జనానికి వివరించి నిర్ణయం ప్రజలకు వదిలేశారు.

జనం చంపాల్సిందేనని తీర్పిచ్చారు. తీర్పును అమలు చేశారు.. గెరిల్లాలు.

ఒకే రోజు మూడు గ్రామాల్లో కమ్యూనిస్టు ద్రోహుల్ని ఏరేసి స్థావరానికి చేరుకున్నారు. దళ కమాండర్ ముందు కూర్చుని వున్నారు.. దళ సభ్యులు.

"గెరిల్లాకు తుపాకి ఎలాగో, గుర్రం కూడా అట్లాంటిదే. అది ఎవడి చేతిలో ఉంటే వాడికి ఉపయోగపడుద్ది. అదే ఒక్కోసారి మన ఉనికిని శత్రువుకు కూడా తెలియజేస్తుంది. శత్రువుకు తెలిసిన విద్యలన్నీ మనకు తెలిసుండాలి కూడా." అని బోధించాడు. దళ సభ్యులు వారం పాటు ఆ గుర్రం మీద మూసీ ఇసుకలో స్వారీ నేర్చుకున్నారు. "మనం స్థావరం మార్చాలి. పోలీసులు ఎప్పుడైనా దాడి చేయొచ్చు. ప్రస్తుతం మనకీ గుర్రం ప్రతిబంధకం. చూస్తే శత్రువు వెంటనే గుర్తుపడతాడు. శత్రువుకు దొరికితే మరింత ప్రమాదం. దీన్ని పట్టుకొచ్చిన అవసరం కూడ తీరింది." అని గుర్రాన్ని ఇస్తారికి అప్పజెప్పాడు. కమ్యూనిస్టుల్ని పట్టిచ్చిన పోలీసు గుర్రం మూసీ ఇసుకలో మట్టైపోయింది.

✦

**మల్లుతోంది వయసు.. వృద్ధాప్యం నుంచి పసితనానికి. చెరిగిపోతోంది మతిమరుపు.. పాత గురుతులు నుంచి కొత్త జ్ఞాపకాలకు. మరో జీవితానికి సరిపడా కాలం పయనిస్తోంది కురు వృద్ధురాలు సుసన్నా ముషాత్ విషయంలో. రాబోయే జూలై 6 నాటి 116వ పుట్టిన రోజు కోసం ఎదురుచూస్తున్నారు ఆమె ముని మనవలు. ఎటువంటి జబ్బు పడకుండా హాయిగా సేద దీరుతున్న ముషాత్ ఓ ఆరోగ్య శాస్త్ర అద్భుతం, దీర్ఘప్రాయ జన్యు బహుమానం.**

సుసన్నా

# యవ్వని అవ్వ

సుసన్నా ముషాత్ 1899లో జన్మించింది. అలబామా లోండెస్ కౌంటీలో పుట్టి పెరిగింది. ఆమె తల్లిదండ్రులు వ్యవసాయం చేసేవాళ్లు. 1922లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఆమె ప్రతిభకు మెచ్చి టస్కగీ ఇన్‌స్టిట్యూట్‌లో అధ్యాపక విద్యను చదివేందుకు అవకాశం కల్పించింది. పేదరికం వల్ల ఆమె దాన్ని వదులుకుని నేన్నీ (ఆయా)గా వృత్తిలోకి ప్రవేశించింది. తను సాకుతున్న బిడ్డలను కన్నతల్లిగా చూసుకుంటున్న సుసన్నాను యజమానులు వారి వలస వెళ్లిన ప్రతి ప్రాంతానికి వెంట తీసుకెళ్లారు. ఆమెను తమలో ఒకరిగా భావించి ప్రత్యేక గదిని, వసతుల్ని కల్పించారు. అలా ఆమె న్యూజెర్సీ, వెర్మాంట్, కాలిఫోర్నియా, మెక్సికో, వెస్టర్‌చెస్టర్, న్యూయార్క్ ప్రాంతాలను చుట్టొచ్చింది. ఆమె రెండు మూడు తరాల పిల్లల ఆలనాపాలనా చూసుకుంది. హెన్రీ జోన్స్‌ను వివాహమాడినా అది ఎంతో కాలం నిలవలేదు. బిడ్డలూ లేరు. కానీ ఆమె నీడన పెరిగిన పిల్లలంతా పెద్దవారైనా ఇప్పటికీ ఆమెను కలుస్తారు. ప్రస్తుతం న్యూయార్క్‌లోని బ్రూక్లిన్‌లో కెనరీస్ వాండేలియా వృద్ధ సంరక్షణా గృహంలో సేదతీరుతోంది. కానీ, ఆమెకు పదేళ్ల పాటు తనవారితో 1965 నుంచి రిటైర్‌మెంట్ జీవితాన్ని గడిపిన అలబామాలోని ముషాత్ ఫార్మ్ హౌజ్‌లో గడపడమే ఇష్టం.

భద్రంగా దాచుకున్న ఫోటో ఆల్బమ్

లోయిస్‌తో..

వాండేలియా హౌజ్‌లో తన బంధువు లోయిస్ జడ్జ్, సంరక్షకురాలు సిసిలీ ఫ్రెసర్‌తో తన జ్ఞాపకాలను పంచుకుంటూ హాయిగా జీవిస్తోంది. ఆ విషయాల్ని గుర్తుచేసుకుంటూ నవ్వుతుందట. పదిహేనేళ్ల క్రితం గ్లకోమా వల్ల చూపు కోల్పోవడంతో తన కోసం వచ్చిన వారి గొంతుల్ని గుర్తుపట్టి పలకరిస్తుంది. వారితో సన్నిహితంగా మెలుగుతుంది. నూరేళ్ల వయసున్న దానిలానే కనిపించదు. అంతకు మునుపు ఓ ఫ్రెంచి మహిళ 122 ఏళ్లు జీవించి రికార్డు నెలకొల్పినా, సుసన్నా అంత ఆరోగ్యంగా ఆమె లేదని వైద్యులు చెబుతున్నారు. ఈ ఆరోగ్యమే ఆమెను మిస్ సూసీ అంటూ ఓ సెలబ్రెటీని చేసింది. ఆమెను చూసేందుకు పర్యాటకులు రావడం విశేషం.

**సుదీర్ఘ మర్మం**

సుసన్నాలా వందేళ్లు నిండిన వారు డెబ్భై లక్షల మందిలో ఒకరుంటారు. జోన్స్ అమ్మమ్మ కూడా 117 ఏళ్లు జీవించిందని రికార్డుల్లో ఉంది. వయసు మళ్లినవారికి వచ్చే హృద్రోగ, నాడీ, కండరాల సమస్యలు కానీ, డయాబెటిస్ కానీ, క్యాన్సర్ కానీ ఆమెను పలకరించకపోవడంపై వైద్యులు ఆశ్చర్యపోతున్నారు. ఇప్పటికీ తన పని తాను చేసుకోగలడం, మంచి జ్ఞాపకశక్తి ఉండటం గొప్ప విషయమంటున్నారు. అసలు వృద్ధాప్య లెక్కల్ని తారుమారు చేస్తూ 96వ ఏట ఆమెకు కింది దవడలో కొత్త పన్ను వచ్చింది. ఇది జ్ఞానదంతం కాదు. అలాగే, నాలుగేళ్ల నుంచి ఆమె జుత్తు రంగు తెలుపు నుంచి బూడిద రంగులోకి మారింది. ఇది అసంభవమని, వయసు తిరగబెడుతున్నట్టు సూచన అని భావిస్తున్నారు. సుదీర్ఘ కాలం బతకాలనే మానవుని కాంక్షకు సుసన్నా జన్యువుల తీరులో సమాధానం లభించొచ్చని అంటున్నారు. ఆమెకు కాళ్ల పీకడం, తల నొప్పి వంటి సమస్యలు కూడా లేవు. కేవలం ఓ బి.పి. బిళ్ల, విటమిన్ల గొట్టాన్ని మాత్రమే వేసు కుంటుంది. ఏడాదికి నాలుగే సార్లు వైద్యులు సుసన్నాను చెకప్ చేసి వెళతారు. అది తప్ప ఎటువంటి వైద్య సహాయం తీసుకోవడంలేదు. జన్యువుల్లోనే ఆమె ఆరోగ్య మర్మం ఉందని వైద్యులు అంటుంటే ఆమె మాత్రం తన జీవన శైలి ఇచ్చిన వరమని అంటోంది.

సుసన్నా యవ్వనంలో ఉన్నప్పుడు మత్తు పానీయాలు, సిగరెట్ల వంటి వ్యసనాల్ని దూరంగా నెట్టింది. చాలా సాదా సీదా జీవనాన్ని గడిపింది. అర్ధరాత్రి పార్టీల వంటివి లేనేలేవు. వ్యాయామం, శ్రమతోనే రోజు మొదలై పూర్తయ్యేది. ఆఖరకు కాఫీని కూడా దరిచేరనిచ్చేది కాదు. ఎక్కువగా పండ్లను, రెడ్ మీట్ తీసుకునేది. సుసన్నా ఇప్పటికీ క్రాన్‌బెర్రీ రసంతో రోజు ప్రారంభిస్తుంది. అధికంగా నీరు తీసు కుంటుంది. ఆమె సంతోషకరం, ఆరోగ్యకరమైన జీవితానికి మరో కారణం. దాతృత్వం, కుటుంబ బాంధవ్యం. తమలో ఒక మనిషిలా చూసుకున్న యజ మానులు జీతం వాడే అవకాశం కల్గించలేదు. దాంతో ఆమె తన జీతాన్ని పేద పిల్లల చదువులకు ఉపయోగి ంచేది. తనకు తెలిసిన పిల్లలకు బహుమతుల్ని కొనిపెట్టేది. ఎప్పుడూ పిల్లలే మధ్యే గడిపేందుకు ప్రయత్నించేది. ఆమె ఎప్పుడో కొనిపించిన కాశ్మీరీ శాలువా ఇప్పటికీ లోయిస్ తన వద్ద పదిలంగా దాచుకుంది. సుసన్నా ఎప్పుడూ తన బంధువుల్ని పెద్ద కుటుంబంగా భావించి సన్నిహితంగా ఉండేది. ప్రేమలు, ఆప్యాయతలకు లోటు లేదు.ఆమెకు ఉన్న ఒకే ఒక అలవాటు పుదీన గమ్‌ను నమలడం. ఒకేసారి 5 గమ్‌లను నోట్లో వేసుకుని చప్పరిస్తుంది. సుసన్నాకు బాగా ఇష్టమైంది మాత్రం మంచి దుస్తుల్ని ధరించడం, అందంగా అలంకరించుకోవడం. ఖరీదైన వస్తువులపై మాత్రం మోహం లేదు.

## ఆ రెండు ఏవి?

**ఈ**చిత్రంలో ఓ విచిత్ర జీవి ఉంది. అందులో మొత్తం రెండు జంతువుల శరీర భాగాలున్నాయి. అవి ఏవో గుర్తించి చెప్పండి.

## ఇల్లు చేరేదెలా?

**కా**రు ఇల్లు చేరాలంటే ... చాలా అడ్డంకులున్నాయి. మరి సరైన దారి ఏదో గుర్తించండి.




## ఎవరి పేరేంటో?

**ఇ**క్కడ 8 బొమ్మలున్నాయి. వాటిని ఇంగ్లీషులో ఏమంటామో మీకు తెల్సు కదా. బొమ్మ ఎదురుగా వాటి పేర్లు రాసేయాలి. మరి రెడీనా!




## పాము బొమ్మ గీద్దామా



# రాతి బొమ్మలోయ్!

'**రా**క్ గార్డెన్' హర్యానా, పంజాబ్ రాష్ట్రాలకు రాజధాని చండీగఢ్‌లో పాతిక ఎకరాల విస్తీర్ణంలో వుంది. ఇక్కడ వేల రకాల మానవ, జంతు ఆకారాలను మనం చూడొచ్చు. ఇవే కాకుండా...అందమైన భవన ప్రాకారాలు, లోయలు, ప్రవాహాలు, వాటిని కలుపుతూ వింత దార్లు కనిపిస్తాయి.

- ఇక్కడి బొమ్మలన్నిటినీ పగిలిపోయిన గాజులు, కప్పులు, సీసాలు, కుండలు, జాడీలు, బల్బుల ముక్కలతో బాగా కాలిన ఇటుకలు, పగిలిన కుండలు, చెట్ల బెరడు, గుడ్డపేలికలు, ప్లాస్టిక్ బొమ్మలు, పాడైపోయిన టోపీలు, ఎలక్ట్రికల్ వస్తువులు, పగిలోపోయిన రంగురంగుల గాజు ముక్కలు, వాడిన బూట్లు, కాలిపోయిన బల్బులు, పంచర్ పడిన టైర్లు, సీసాలు, పాడైన సైకిల్ భాగాలు, పక్షి గూళ్ళు...వంటి వాటితోనే తయారుచేశారు.
- తాజ్‌మహల్ తర్వాత భారత్‌లో గొప్ప కళాత్మక నిర్మాణంగా దీనికి పేరు ఉంది. ఈ అద్భుత సృష్టిని రోజుకు 5000 మంది సందర్శిస్తుంటారు.
- మరి ఇంత అద్భుతమైన, అందమైన పార్కు సృష్టికర్త ఎవరో తెలుసా? నెక్ చంద్. ఈయన చండీగఢ్‌లోని పబ్లిక్ వర్క్స్ డిపార్టుమెంట్‌లో రోడ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసేవారు. మొదట్లో తన కోసం ఒక చిన్న పార్కు ఏర్పాటు చేసుకోవాలని అనుకున్నాడు. దానికోసం అడవిలో కొంత భాగాన్ని శుభ్రం చేశారు. ఆఫీసు పని పూర్తి కాగానే తన సైకిల్‌మీద వెళ్లి పనికిరాని వస్తువులు, వాడిపడేసిన, పగిలిపోయిన వస్తువులు, అందమైన చిన్న చిన్న రాళ్లు సేకరించేవారు. రాత్రి సమయాల్లో వీటిని పెద్దపెద్ద కళాఖండాలగా మలిచేవారు. 1976 నాటికి ఇది పార్కుగా మారింది. నెక్ చంద్ సృష్టించిన కళాఖండాలలో ఎక్కువ శాతం మన దేశంలోనే ఉన్నప్పటికీ విదేశాల్లోనూ వున్నాయి.

**అదో అద్భుతమైన పార్కు. లోపలికి అడుగెడితే చాలు.కొంగలు, బాతులు, కోతులు, జంతువులు, ఆడవాళ్లు, మగవాళ్ల బొమ్మలు బోలెడన్ని కనిపిస్తాయి. విశేషం ఏమంటే ఇవన్నీ పనికి రాని వస్తువులతో చేసినవే. పైగా వీటన్నిటినీ తయారుచేసింది ఒక్కరే. ఇన్ని విశేషాలున్నదే రాక్ గార్డెన్.**

- ఇవన్నీ చదువుతుంటేనే... ఎప్పుడెప్పుడు అక్కడికెళ్లి చూద్దామా అనిపిస్తోందికదా. కానీ అప్పట్లో ప్రభుత్వ అధికారులు ఈ గార్డెన్‌ను పూర్తిగా తీసిపారేద్దామ నుకున్నారు. ఎందుకంటే ఈ అద్భుత కళా ఖండాలను ఏర్పాటు చేసింది ప్రభుత్వ స్థలంలో. అందుకే అధికారులు ఈ పార్క్ ను తొలగించాల్సిందేనని బుల్డోజర్లను పంపారు. విషయం తెల్సిన జనాలు మానవ హారాలు కట్టి తమ నిరసనను తెలియ చేశారు.
- ఇలా ఎన్నో నిరసనల అనంతరం ప్రభుత్వం పార్క్‌ని యథాతథంగా వుంచడానికే నిర్ణయించు కుంది ప్రభుత్వం. లేకపోతే... మనకు ఇంత మంచి గార్డెన్‌ను చూసే అదృష్టమే వుండేదికాదు.
- రాక్ గార్డెన్‌ను ప్రతిరోజూ తెరిచే ఉంచుతారు. ఎండాకాలంలో (ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబరు 30 వరకు): ఉదయం 9 నుండి సాయంత్రం 7గంటల వరకు. శీతాకాలంలో(అక్టోబర్ 1 నుంచి మార్చి 31 వరకు) ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు తెరిచి ఉంచుతారు. ఈ పార్కులోకి ప్రవేశ రుసుము పెద్దలకు రూ.5లు, పిల్లలకు రూ.3లు.



# మధ్య తరగతి రంగు చీర

"**భా**ను తిష్టం జగత్సర్వం" - భానుడు స్పృశించని సాహితీ సంపద లేదు. ఇది చారిత్రక సత్యం. వేంపల్లి సికిందర్ కథా సంపుటి "అమ్మ చీర" కూడా ఈ కోవకు చెందినదే. ఇందులో మధ్య తరగతి జీవితాన్ని అందంగా ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. పాత్రల్ని చిత్ర రూపాలుగా చిత్రించడం వేరు. ఆ పాత్రలకు ప్రాణ ప్రతిష్ట చేయడం వేరు. సికిందర్ కథలు అందమైన చిత్తరువులు. 'అమ్మ చీర' కథ జీవితంలో ఓడిపోయిన రాములయ్యను చావులోనూ ఓడించింది. 'వృక్షో రక్షతి రక్షితః' కథ లౌకిక ప్రపంచానికి చెందిన చిన్న జిమిక్కు. మరో కథ 'శ్రమ జీవన మాధురి' వంటి కథల ఆవశ్యకత ఈ రోజు ఎంతైనా ఉంది. 'గులాబీ గోళ్ళు' వంచనను వంచనతో జయించాలి. భర్త రాము సహకారంతో సుధ ఆడిన నాటకం రక్తి కట్టింది. లాజిక్కుల గురించి ఆలోచించవలసిన అవసరం లేదు. బాధ్యత పరిమళాలు రెక్కలవిసిన సమయానికి రెక్కలొచ్చిన పిల్లల చేయూత నేపథ్యంలో సాగింది. నిజానికి సక్రమంగా నిర్వర్తించిన ఏ బాధ్యతైనా పరిమళభరితమైనదే! 'వ్యాలన్‌టీన్స్' ఏ వయసు సరదాలు ఆ వయసులో వుంటాయి. ఆ సరదాలకు ఓ హద్దుండాలి. ఎక్కడో ఒక చోట జ్ఞానోదయం కావాలి. అది జరిగింది. ఈ కథలన్నింటిలో సమకాలీన సమస్యని స్పృశిస్తూ సాగిన కథ. 'ప్రవాహంలో నాచు' సల్మా ఓ ముస్లిం అమ్మాయి. చదువు మీద ధ్యాసతో నాలుగిళ్ళలో పాచి పని చేసి చదువుకుంటుంది. యజమానురాలి ఆరళ్ళు మామూలే! పేదరికం డబ్బుని కోరుతుంది. పేదరికాన్ని డబ్బుగా మార్చుకోవడానికి సవాలక్ష వినిమయ సాధనాలున్నాయి. అందులో నేటి సమస్య అమ్మాయి అమ్మకం. దీన్ని ఇతివృత్తంగా తీసుకొని సాగిన కథ. ముగింపు మాత్రం రేపటి తరానికి స్ఫూర్తిగా లేదు. దుబాయి షేక్‌తో నిఖా ఖాయమైపోయిందన్న వార్త చదువరులను బాధపెడుతుంది. వృత్తి విద్య నేపథ్యంగా సాగిన కథ 'పని కొచ్చే బరువు'. చదువుకొనే రోజు నుంచి - బ్రతుకు తెరువు కోసం చదువుకునే రోజులొచ్చాయి. చదువుని కొన్నా అమ్మినా భవిష్యత్తుని చక్కదిద్దేదిగా వుండాలి. అదే ఈ పనికొచ్చే కథ!. కథలన్నింటిలో మధ్యతరగతి జీవితం ప్రధానంగా కనిపిస్తుంది. సికిందర్ ఇంకాస్త లోతుగా విశ్లేషించి వుంటే ఈ కథలు మరింత ఆయుష్షుని పొందగలిగివుండేవి. రచయితకి కథా సాహిత్యం మీద వల్లమాలిన ప్రేమ ఉంది. రచనా వ్యాసంగం మీద మక్కువ ఉంది. ఆ మక్కువే ఎక్కువైంది. రచయిత నిజాయితీగా 'నా జీవన యాత్రవలె నా కథల్లోనూ వ్యథ ఉంది. ముసిరిన చీకటిలాంటి వెతల్లోంచి వెలుగులో కెళ్ళే ప్రయత్నంలో ఘర్షణలో ఓడి వాడిన ఉదంతమూ ఉంది' అంటాడు. ఇది

**అమ్మ చీర,**
**కథా సంపుటి, రచన: వేంపల్లి సికిందర్,**
**పేజీలు: 117, ధర:రూ.75/-,**
**ప్రతులకు: రచయిత, నెం.8, గ్రీన్ పార్క్ అపార్ట్‌మెంట్, బ్లాక్ ఎ, డి.ఆర్.మహల్ రోడ్, తిరుపతిX 517501. మరియు ప్రజాశక్తి, విశాలాంధ్ర బుక్‌హౌస్‌లు.**

**- ఇమంది రామారావు**

---

# గవిడి 'వలస పాట'

**వలస పాట,**
**కవి: గవిడి శ్రీనివాస్,**
**పేజీలు: 88,**
**వెల: 50/-,**
**ప్రతులకు: గవిడి శ్రీనివాస్**
**గాతాడ-532127. మర్రివలస**
**రాజాం, విజయనగరం**
**సెల్: 08886174458, 09966550601**

**వి**శాఖపట్నం సాహితీ స్రవంతి ప్రచురణగా వెలువడిన కవితా సంపుటిలో 50 కవితలున్నాయి. మనసు వదిలి వలస పోని "మట్టిపాట" అంటూ అద్దేపల్లి రామమోహన్ రావు, మరలా ప్రకృతి దగ్గరికి అంటూ కె. శివారెడ్డి చక్కటి విలువైన ముందు మాటలు రాశారు. పాఠకుల్ని ప్రకృతి దగ్గరికి , సౌందర్యం దగ్గరికీ శ్రీనివాస్ అక్షరంతో తీసుకెళ్తారు. 'రంగుల పక్షిలా పరవశించి అనురాగ రాగాన్ని అలంకరించాను/ కాలం వొడిలో మనం గాఢంగా మౌనంగా/ మనసులు మార్పిడి చేసుకున్నాం అంటారు 'నీ జ్ఞాపకాల పొరల్లో' అనే కవితలో. 'నక్షత్రాల పువ్వుని నీటి దోసిళ్ళలోనే దాచా/ మనో వీధిలో పుష్పక విమాన మెక్కి/ నే జాతర చేస్తున్నట్లు అవిరాళ భావాల మధ్య/ శీతల సుందరిని ముస్తాబు చేస్తూ ఈ సంధ్యను ముగిస్తాను' అంటారు 'ఒక శీతల సాయంత్రం'లో. 'నీరెండిన గుండె ఎడారిలో/ విజయం అలల తాకిడి / తీరాన్ని చేరుస్తుంది. మనస్సుల్ని రంజింప చేస్తుంది' అని 'అలల తాకిడి' అనే కవితలో. ఇలా ప్రతి పంక్తిలో అలంకారమో, భావ చిత్రమో, వర్తమాన సామాజిక వైరుధ్యమో కనిపిస్తాయి. 'ఒక వీడ్కోలు' అనే కవితలోని చివరి వాక్యాలు పాఠకుణ్ణి ఆర్తితో ఆలోచింపజేస్తాయి. 'కరెన్సీ భాషలో కొలవలేని/ కాలం చూరులోంచి జారే రసామృతాన్ని/ ప్రశ్నార్థకంగా వదిలి/ హృదయాన్ని ట్రాలీలో మోసుకుపోతూ/ ఈ జీవచ్ఛవాన్ని విడిచి, రెక్కలు కట్టుకు ఎగిరిపోతావ్' ఇలా అన్ని కవితలు భావస్ఫోరకంగా ఉన్నాయి.

**- తంగిరాల చక్రవర్తి**

# చిట్టి చేతి లోతైన చిత్రాలు

ఆ కోమలమైన వేళ్లను తాకి వర్ణాలు అదృష్టం చేసుకున్నాయి. ఆ నిర్మలమైన మనస్సున ఉదయించి చంద్ర తారార్కాలు చిత్తరువుల్లో జీవం పోసుకున్నాయి. ప్రకృతే పరవశించి అతడి వశమైంది. నాలుగేళ్ల వయసుకే ప్రకృతి తత్త్వాన్ని చిత్తరువుల్లో బంధించిన ఎడ్మండ్ థామస్ క్లింట్ వర్ణచిత్రాల నిధిని అందుకుని ధన్యులమయ్యాం. కేరళలోని కోచిలో 1976 మే 19న జన్మించిన థామస్ తన చిత్రాలతో ప్రపంచానికి కొత్త జన్మనిచ్చాడు. కేవలం 2522 రోజుల్లో 25 వేల చిత్రాల్ని సృజించిన థామస్ జీవించింది కేవలం ఏడేళ్లే. పుట్టిన ఏడాదికే కచ్చితమైన వృత్తాన్ని గీసి తన కళా తృష్ణను, తన అమేయమైన మేధను ప్రకటించాడు. నిశితంగా గమనించిన ప్రపంచాన్ని చిత్రాల్లోకి తర్జుమా చేస్తూ రోజుకు వంద చిత్రాలపైనే అందించేవాడు. చుట్టూ ఉన్న ప్రపంచాన్ని లోతుగా పరిశీలించి, తనదైన శైలిలో విశ్లేషించి ప్రతి వివరాన్ని స్పష్టపరుస్తూ చిత్రాలను గీయడం ఏళ్ల అనుభవమున్న చిత్రకారులకే సాధ్యం. అలాంటిది నాలుగేళ్ల వయసుకే లోతైన చిత్రాల్ని వేసేవాడు. సాయం సంధ్య సూర్యుడి  వెలుగులో ప్రకృతిని చూస్తూ... ఈ రంగులన్ని ఎక్కడి నుంచి వస్తున్నాయని ప్రశ్నించుకుని చిత్రాలతో సమాధాన పడ్డాడు. పుత్రశోకుడైన రావణుని వ్యథను, బిడ్డలకు పాలిస్తున్న తల్లిపులి మాతృత్వాన్ని, కేరళ జాతరలోని కోలాహలాన్ని, తెయ్యం నృత్యంలోని వీరరసాన్ని, ఒడ్డున సేదతీరుతున్న నాగపడవల విలాసాన్ని, వెదురు చెట్లకు నగిషీలు పెడుతున్న సూర్యకాంతిలోని జీవాన్ని ఇలా ప్రతిదానిలో వస్తువుని తేలిగ్గా చిత్రాల్లో పట్టేశాడు. తనకిష్టమైన రామాయణ, మహాభారతాల్లోని ఘటనల్ని, డేవిడ్ గోలియెత్ వంటి సాహస కథల్ని వస్తువు చేసుకున్నాడు. మూడేళ్లపుడు కిడ్నీ వ్యాధి బారినపడి నరకం అనుభవించినా చిత్రాల్ని వేయడం మానలేదు. తిరిగి ఆరోగ్యం పుంజుకున్నా మరో నెలలో ఏడో ఏడు వస్తుందనగా తన అమరమైన చిత్రాల్ని అందించి తుదిశ్వాస విడిచాడు. "ఏడవకు అమ్మా. నేను నిద్రపోతాను అంతే.. ఏమీ కాదు." అని మరణానికి ముందు తల్లిని ఓదార్చినా, "మనం ఎక్కడి నుంచి వచ్చాం? చావు తర్వాత ఎక్కడికి వెళ్తాం? ఎందుకు చనిపోతాం?" అని అంతకు ముందే ప్రశ్నించి ఆలోచనలో పడిపోయినా అతడు సామాన్యుడు కాదని స్పష్టమౌతుంది. అతడి స్మృతుల్ని సజీవం చేసుకున్న చిత్రాలను క్లింట్ మెమోరాబ్లియా పేరిట జాగ్రత్త చేస్తున్నారు. వివిధ రూపాల ద్వారా అతడి లోతైన కళ ప్రపంచంలోని పది లక్షల కుటుంబాల్లో భాగమైంది. ●



# ఫ్రేమికులు



ఓ క్షణాన్ని బంధించేందుకు ....... గంటలు, రోజులు రాత్రనక, పగలనక కునుకు తీయనివ్వదు. ఓ సూక్ష్మాన్ని పట్టేందుకు విశాల లోకం కంటి రెప్ప వేయనివ్వదు. దహిస్తున్న మనిషి కళాతృష్ణకు లావా హారతి పడుతోంది. ధ్యానిస్తున్న మానవుడి కళా పిపాసకు అడవి మంచె కడుతోంది. కళ మీద ఉన్న మనిషి తీపి ఎంతటి సాహసాన్నైనా చేయిస్తుందనడానికి ఈ ఫొటోగ్రాఫర్లే ఉదాహరణ. వేల అర్థాల్ని ఓ చిన్న ఛాయాచిత్రంలోకి మళ్లించేందుకు ఈ ఫ్రేమికులు పడే తపన, శ్రమ అంతా ఇంత కాదు. కొన్ని చిత్రాల్ని తీసేందుకు రోజుల సమయం కదలకుండా నిరీక్షించడం వారికి మామూలే. ఓ చిన్న డిటైల్ ఫ్రేమ్‌లోకి చేరేందుకు వారు చేసే శోధన అంతా ఇంతా కాదు. వారికి కావాల్సిన పర్‌ఫెక్ట్ క్లిక్ కోసం ఓ యుద్ధం, తపస్సే చేస్తారు. అందుకే ఈ ఛాయాచిత్ర కళ అంత ప్రత్యేకం. కేవలం ఓ చిన్న షట్టర్ సౌండ్‌కే ఓ జన్మకు సరిపడా సంతృప్తిని నింపుకునేది అందుకే. పులిట్జర్ బహుమతులు వంటివి కేవలం వారి సంతృప్తిని పంచుకునేందుకు చేసేవే. ఫ్రేమ్‌లో లీనమై చుట్టూ ఉన్న ప్రపంచంతో సంబంధం తెంచుకుని లెన్స్ గుండా టెలిపోర్ట్ అయిపోతున్న కొందరు ఫొటోగ్రాఫర్ల విన్యాసాలు మీ కోసం...

●